తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి

బుధవారం
18 నవంబర్ 2026

పేజీలు : 8

Follow :

గోదావరి గర్భంపై

మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతులపై అనుమానాలు?

ఇసుక మాఫియా కన్ను..?

- సింగిరెడ్డిపల్లి పేరుతో అనుమతులు.. భూపతిరావుపేట పరిధిలో తవ్వకాలు..?
- భూపతిరావుపేటలో ఇసుక డంపింగ్.. సొసైటీల ముసుగులో తెరవెనుక వ్యాపారమా..?
- అక్రమాల ఆరోపణలపై సమగ్ర విచారణకు ప్రజల డిమాండ్..?

పినపాక, నవంబర్ 17(జనంసాక్షి):
గోదావరి ఇసుక సంపదపై అక్రమార్కుల కన్ను పడిందా? గిరిజన సొసైటీలకు ఉపాధి కల్పించాల్సిన ఇసుక ర్యాంపులు కొందరి వ్యాపార ప్రయోజనాలకు అడ్డాగా మారుతున్నాయా? పినపాక మండల పరిధిలోని సింగిరెడ్డిపల్లి ఇసుక ర్యాంపు వ్యవహారం ఇప్పుడు పలు అనుమానాలకు కేంద్రంగా మారింది. ఒక గ్రామపంచాయతీ పేరుతో అనుమతులు పొందుతూ, మరో రెవెన్యూ పరిధిలో తవ్వకాలు, ఇంకో ప్రాంతంలో ఇసుక నిల్వలు ఏర్పాటు చేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. అనుమతులు ఒకచోట.. తవ్వకాలు మరోచోట.. డంపింగ్ ఇంకోచోట అన్నట్లుగా సాగుతున్న వ్యవహారంపై అధికార యంత్రాంగం స్పందించకపోవడంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.



- అనుమతుల పరిధి ఎక్కడ.. ? తవ్వకాలు జరుగుతున్నదెక్కడ...?
సింగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఇసుక ర్యాంపు నిర్వహణకు మాత్రమే ప్రభుత్వ అనుమతులు జారీ అయినట్లు సమాచారం. అయితే వాస్తవంగా ఇసుక తవ్వకాలు జానంపేట రెవెన్యూ పరిధిలో జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు జారీ చేసిన ప్రాంతం, తవ్వకాలు నిర్వహిస్తున్న ప్రాంతం వేర్వేరుగా ఉన్నాయనే ప్రచారం పలు ప్రశ్నలకు తావిస్తోంది. ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న సరిహద్దులు ఏమిటి? తవ్వకాలకు అనుమతించిన సర్వే నంబర్లు ఏవి? జానంపేట పరిధిలో తవ్వకాలకు ప్రత్యేక అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

- భూపతిరావుపేటలో ఇసుక నిల్వలు.. తెరవెనుక వ్యవహారమేంటి..?
సింగిరెడ్డిపల్లి పేరుతో ర్యాంపునకు అనుమతులు పొందినప్పటికీ, ఇసుక నిల్వలు మాత్రం భూపతిరావుపేట వద్ద ఏర్పాటు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్కడి నుంచి జానంపేట మీదుగా ఇసుక వాహనాలు రాకపోకలు సాగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. భూపతిరావుపేటలో ఇసుక డంపింగ్‌కు అనుమతులు ఉన్నాయా? నిల్వ చేస్తున్న భూమికి రెవెన్యూ శాఖ అనుమతి ఉందా? ర్యాంపు అనుమతుల్లో డంపింగ్ ప్రాంతాన్ని పొందుపరిచారా? అనే అంశాలు విచారణలో తేలాల్సి ఉంది. అనుమతుల పరిధిని దాటి ఇసుక నిల్వలు, రవాణా జరుగుతున్నాయా అన్నది అధికారులు నిగ్గు తేల్చాలి.

- గోదారమ్మ గర్భాన్ని గుల్ల చేస్తున్నారా...?
గోదావరి నది సహజ సంపదను

మిగతా 2లో



తెల్లం శరత్ హత్యతో అట్టుడికిన భద్రాద్రి

- లాడ్జి సిబ్బంది దాడిలో గిరిజన యువకుడు మృతి..
- నిందితులపై కఠిన చర్యలకు ఆదివాసీ సంఘాల డిమాండ్..
- శ్రీ సత్యసాయి రెసిడెన్సీని సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు..

వార్తా లోపలి పేజీలో

ప్రజల సౌకర్యవంతమైన ప్రయాణమే లక్ష్యం

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు

సూర్యాపేటలో రద్దీ ప్రాంతాల్లో వాహనాల తనిఖీలను పరిశీలించిన జిల్లా ఎస్పీ నరసింహ



వార్తా లోపలి పేజీలో



నాణ్యతతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

కలెక్టర్ దివాకర్

ఖోఖో ఇండియా క్రీడల నిర్వహణ పై క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కలెక్టర్

ఖమ్మం కార్పొరేషన్,నవంబర్ 17(జనంసాక్షి)
8 వ ఖోఖో ఇండియా యూత్ గేమ్స్ కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అన్నారు. మంగళవారం కలెక్టర్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య,

వార్తా లోపలి పేజీలో

జనంసాక్షి దెబ్బకు దిగొచ్చిన అధికారులు

కంగుతిన్న సర్పంచ్ భర్త!

- కార్యదర్శి కుర్చీలో సర్పంచ్ భర్త దర్జాపై జనంసాక్షి కథనం ఎఫెక్ట్
- జిరాక్స్ కోసం వచ్చి పొరపాటున కూర్చున్నాం అంటూ నీచమైన సాకులు



మాడుగులపల్లి, నవంబర్ 17 (జనంసాక్షి):
నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం చిరుమర్తి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సొంత జాగీరులా మార్చుకుని, ఏకంగా పంచాయతీ కార్యదర్శి కుర్చీలోనే కూర్చుని సర్పంచ్ భర్త చెలాయించిన దర్జాపై జనంసాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనం అధికారులను కదిలించింది పంచాయతీ ఆఫీసులో పెత్తనం ఎవరిది?.. కార్యదర్శి కుర్చీలో సర్పంచ్ భర్త దర్జా! అంటూ జనంసాక్షి వెలుగులోకి తెచ్చిన సంచలన కథనంతో

వార్తా లోపలి పేజీలో

ధర్మోజిగూడెం శివారులో దొంగల బీభత్సం

10 గొర్రెలు అపహరణ

చౌటుప్పల్, నవంబర్ 17(జనంసాక్షి)
గుర్తు తెలియని దొంగలు దొడ్డిలో ఉన్న పది గొర్రెలను అపహరించుకుపోయిన ఘటన ధర్మోజిగూడెం గ్రామ శివారులో చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లం బావి గ్రామానికి చెందిన నీల కిరణ్ (27) గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ధర్మోజిగూడెం గ్రామ శివారులో సొంత భూమి ఉంది. అక్కడ ఏర్పాటు చేసిన దొడ్డిలో సుమారు 150 గొర్రెలను పెంచుతున్నాడు. రోజు వారీ లాగే సోమవారం రాత్రి 7 గంటల సమయంలో గొర్రె లన్నింటినీ దొడ్డిలోకి తోలిన కిరణ్, రాత్రి 10 గంటల వరకు అక్కడే కాపలా ఉండి ఆ తర్వాత ఇంటికి వెళ్ళా డు. తిరిగి మంగళవారం ఉదయం 5 గంటల ప్రాంతం లో దొడ్డి వద్దకు వెళ్లి పరిశీలించగా.. అందులో 2 గొర్రె పొట్టేళ్లు, 8 గొర్రెలు (మొత్తం 10 జీవాలు) కనిపించ లేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించక పోవడం తో, రాత్రి సమయంలో గుర్తు తెలియని దొంగలు వాటిని దొంగలించుకుపోయినట్లు నిర్ధారించుకున్నాడు. బాధితుడు నీల కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

జనంసాక్షి

నాణ్యతతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టర్ దివాకర్

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి.శ్రీజ లతో కలిసి సర్దార్ పటేల్ స్టేడియంలో క్రీడల నిర్వహణ ఏర్పాట్లపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, క్రీడల నిర్వహణ విజయవంతా నికి చేపట్టే పనులు నాణ్యతలో రాజీ లేకుండా త్వరిత గతిన పూర్తి చేయాలని అన్నారు. రూ. 3.12 కోట్ల వ్యయంతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల వివ రాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనుమతులు మంజూరై, ఒప్పందం పూర్తయిన పనుల్లో కొత్తగా నిర్మించిన సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌కు కావాల్సిన లైటింగ్ సదుపాయాల ఏర్పాటు చేయాలన్నారు. సింథటిక్ ట్రాక్‌కు అదనపు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా చైన్ లింక్ మెష్ ఏర్పాటు, ప్రహరీ గోడ నిర్మాణం, ఇంటర్‌లాకింగ్ కాంక్రీట్ బ్లాక్ పేవ్‌మెంట్ల నిర్మాణం, అల్యూమినియం స్తంభాలతో హ్యామర్ త్రో కేజ్ ఏర్పాటు, స్టేడియం గేటు, ఆర్చ్ నిర్మాణం మరుగుదొడ్ల మరమ్మతులు, పెయింటింగ్, టైల్స్ మొదలైన వసతుల కల్పన పనులు చేయాలన్నారు. క్రీడాకారులకు, సందర్శకు లకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రధాన భవనం ప్రవేశ ద్వారం నుండి మెయిన్ గేట్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం, ప్రధాన భవనంలోని అథ్లెట్లు, కార్యాలయ గదులకు పెయింటింగ్, తలు పులు, కిటికీల అమరిక, ఎలక్ట్రికల్ మరమ్మతులు, వాకింగ్ ట్రాక్ లెవలింగ్, నేమ్ బోర్డుల ఏర్పాటు, సీటింగ్ గ్యాలరీల వద్ద టెన్షైల్ కోనికల్ స్ట్రక్చర్ షేడ్ ఏర్పాటు, ప్రధాన భవనంలోని అథ్లెట్, ఆఫీస్ టాయిలెట్ల మరమ్మతులు, గీజర్ల ఏర్పాటు, పార్కింగ్ ప్రాంతంలో చిప్స్ వేయడం, స్టేడియం ప్రాంగణంలో వీధి దీపాల ఏర్పాటు, ఓపెన్ వెల్ సబ్‌మెర్సిబుల్ మోటార్ ఏర్పాటు, సంప్ నుండి నీటి ట్యాంకులకు కనెక్షన్ల కల్పన, పీజీ కళాశాల మైదానం శు భ్రపరచడం, చదును చేయడం, నిరుపయోగ వాహనాల తరలింపు, టేబుల్ టెన్నిస్ కోర్టు పక్కన సీసీ డ్రైన్ నిర్మాణం, ప్రధాన భవనం పక్కనున్న 2 గ్యాలరీలకు పెయింటింగ్, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుకు ఆర్టిస్టిక్ గ్రాఫిక్ పెయింటింగ్, స్విమ్మింగ్ పూల్ గదులు, ఇతర చిన్న తరహా మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.×ఖేలో ఇండియా క్రీడల సమయానికి ముందుగానే పనులన్నీ నాణ్యతతో పూర్తి చేసి, క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో× డిఎస్ఓ టి. సునీల్ కుమార్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, హార్టికల్చర్ అధికారిణి అనితశ్రీ, డిఇ నాగజ్యోతి, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచందర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా బాధ్యతలు చేపట్టిన

గుడిపల్లి ఎస్ ఐ కి కాంగ్రెస్ నాయకుల సన్మానం

పి.ఏ.పల్లి,నవంబర్ 17(జనంసాక్షి):

ఉమ్మడి పి.ఏ.పల్లి మండలం గుడిపల్లి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బి.రాజు కు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నెర్మటి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మండలంలో శాంతిభద్రత పరిరక్షణకు,ప్రజలకు మెరుగయిన సేవలను అందించాలని వారు కోరారు.ఆయనను సన్మానించిన వారిలో డీసీసీ జిల్లా కార్యదర్శి కుక్కల గోవర్ధన్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు వీరమళ్ళ సతీష్, ఉప్పల కోటేశ్వర్ తదితరులు ఉన్నారు.



అంకిరెడ్డిగూడెంలో 44 మందికి నూతన చేయూత పింఛన్ పత్రాల అందజేత

చౌటుప్పల్, నవంబర్ 17(జనంసాక్షి)

మండలంలోని దామెర గ్రామ పరిధిలోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో మంగళవారం నూతన చేయూత పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శాసనమండలి సభ్యులు నెలకంటి సత్యం విచ్చేశారు.ఈ కార్యక్రమంలో సీఈఓ శోభారాణి, చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, ఆర్డిఓ,ఎమ్మార్వో,ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ నారాయణపురం,చౌటుప్పల్ మండల స్థాయి అధికారులు, రెండు మండలాల సర్పంచులు, చౌటుప్పల్ కౌన్సిలర్లు పాల్గొని నూతన చేయూత పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ పత్రాలను అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలలో భాగంగా అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీకి చెందిన గీత కార్మికులు, చేనేత కార్మికులు, వితంతువులు, వికలాంగులు సుమారు 54 మంది దరఖాస్తు చేసుకోగా,ప్రస్తుతం 44 మంది లబ్ధిదారులకు పింఛన్ పత్రాలను సర్పంచ్ సువ్వి మల్లేష్ గౌడ్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ ఇప్పించుటకు తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గంగాపురం పాండు గౌడ్ పంచాయతీ కార్యదర్శి, శివాజీ కారోబార్, చేయూత పింఛన్ లబ్ధిదారులు, గ్రామ మహిళలు, పెద్దలు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి దెబ్బకు దిగొచ్చిన అధికారులు

కంగుతిన్న సర్పంచ్ భర్త!

పంచాయతీ రాజ్ శాఖ అధికారుల్లో ఒక్కసారిగా వణుకు పుట్టింది పత్రికలో వార్త రావడం, ప్రజలు తీవ్రంగా మండిపడడంతో మాదుగులపల్లి మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) బి. సంగీత చిరుమర్తి పంచాయతీ వ్యవహారంపై తక్షణమే విచారణ చేపట్టి జిల్లా పంచాయతీ అధికారికి (డీపీవో) నివేదిక సమర్పించారు జనంసాక్షి దెబ్బకు ముక్కున వేలేసుకున్న సర్పంచ్ భర్త, పంచాయతీ సిబ్బంది తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు ఆదివారం జిరాక్స్ కోసం వచ్చి పొరపాటున ప్లాస్టిక్ కుర్చీకి బదులు కార్యదర్శి కుర్చీలో కూర్చున్నారంటూ సాకులు చెబుతూ అధికారులకు వివరణ ఇచ్చుకోవడం గమనార్హం భవిష్యత్తులో మాదుగులపల్లి మండలంలోని చిరుమర్తి పంచాయతీలో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా కట్టడి చేస్తామని అధికారులు నివేదికలో స్పష్టం చేశారు ప్రజాస్వామ్యంలో అరాచకాలపై నిలదీసే జనంసాక్షి కథనంతోనే అధికారులు దిగొచ్చి విచారణ జరిపారని, ఇకపై ఇలాంటి అనధికార పెత్తనాలు చెల్లవని చిరుమర్తి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ



చండూరు, నవంబర్ 17 (జనంసాక్షి)

మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలో వివిధ కేటగిరీల కింద కొత్తగా 522 మందికి చేయూత పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో బండారి యాదగిరి తెలిపారు. వీరికి నేడు మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా మంజూరు పత్రాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులందరూ ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని ఇప్పటికే పంచాయతీ కార్యదర్శుల ద్వారా సమాచారం అందించినట్లు వెల్లడించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా గుడిసెల్లో నివసించే 70 మంది లబ్ధిదారులుగా ఎంపిక కాగా, ఇప్పటివరకు 55 మందికి మంజూరు ఉత్తర్వులు అందాయని, మిగిలిన 13 మందికి త్వరలోనే అందజేస్తామని ఎంపీడీవో వివరించారు.

దేవరకొండలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తం

○ఏడు రోజులైనా అందని మిషన్ భగీరథ నీరు..

○ప్రజల అవస్థలు పట్టించుకోని అధికారులు : బీఆర్ఎస్వీ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ



దేవరకొండ, నవంబర్ 17 (జనంసాక్షి):

దేవరకొండ పట్టణంలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని, గత వారం రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు కనీస అవసరమైన తాగునీటిని సకాలంలో అందించడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని విమర్శించారు. వారం రోజులుగా నీరు రాకపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూడు రోజులకు ఒకసారి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసేవారని, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఏడు రోజులు గడిచినా నీటి సరఫరా లేకపోవడం విచారకరమన్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు మున్సిపల్ అధికారులపై ఉందని స్పష్టం చేశారు.ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే స్పందించి దేవరకొండ పట్టణంలోని అన్ని వార్డులకు మిషన్ భగీరథ తాగునీటిని పునరుద్ధరించాలని బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు.

గోదావరి గర్భంపై ఇసుక మాఫియా కన్ను..?

కాపాడాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, ఇసుక తవ్వకాల వల్ల నదీ గర్భానికి నష్టం వాటిల్లుతోందనే ఆందోళన లు వ్యక్తమవుతున్నాయి. అనుమతించిన పరిమాణం లోనే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయా? నిబంధన లకు మించి లోతుగా తవ్వుతున్నారా? యంత్రాల వినియోగం, పర్యావరణ మార్గదర్శకాలు పాటిస్తు న్నారా? అనే అంశాలపై శాస్త్రీయ పరిశీలన జరగాలి. నదీ ప్రవాహం, భూగర్భ జలాలు, తీం ్రప్రాంత గ్రామాలపై తవ్వకాల ప్రభావాన్ని కూడా అధికారులు అంచనా వేయాలి. ప్రకృతి సంపదను కాపాడాల్సిన యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తు లో తీవ్ర పర్యావరణ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- సొసైటీల పేరు.. లబ్ధి పొందుతున్నదెవరు..?

గిరిజన, మత్స్యకార సొసైటీలకు ఇసుక ర్యాంపుల ద్వారా ఆర్థిక ప్రయోజనం కలగాల్సి ఉంది. కానీ వాస్తవంగా ఈ వ్యాపారంలో పెట్టుబడులు పెడుతున్నదెవరు? యంత్రాలు ఎవరివి? రవాణా, విక్రయాల నిర్వహణ ఎవరి చేతుల్లో ఉంది? సొసైటీ సభ్యులకు ఎంత ఆదాయం అందుతోంది? వ్యాపారం ద్వారా వచ్చే లాభాలు ఎవరికి చేరుతున్నాయి? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. సొసైటీల ముసుగులో తెరవెనుక రాజకీయ, వ్యాపార ప్రయోజనాలు నడుస్తున్నాయనే ఆరోపణలపై కూడా అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలి. సొసైటీల రికార్డులు, ఆర్థిక లావాదేవీలు పరిశీలిస్తేనే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది.

- రవాణా పత్రాలు ఉన్నాయా? అధికారులు అనుమతించిన మార్గమేనా...?

భూపతిరావుపేట వద్ద నిల్వ చేసిన ఇసుకను జానం పేట మీదుగా తరలిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో రవాణా వ్యవస్థపైనా అధికారులు దృష్టి సారించాలి. ఇసుక వాహనాలకు సరైన రవాణా పత్రాలు ఉన్నా యా? తరలిస్తున్న పరిమాణం ప్రభుత్వ రికార్డులకు అనుగుణంగా ఉందా? వాహనాలకు నిర్దేశించిన మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారా? డంపింగ్ ప్రాంతానికి అవసరమైన అనుమతులు పొందారా? అనే అంశాలను తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది.

- అధికారుల మౌనం వెనుక కారణమేంటి?

ఒక పంచాయతీ పేరుతో అనుమతులు పొంది మరో రెవెన్యూ పరిధిలో తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నా మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టకపోవడం పై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ అనుమతుల పరిధి, వాస్తవ తవ్వకాల ప్రాంతం, తవ్విన ఇసుక పరిమాణం, డంపింగ్ స్థలం, రవాణా పత్రాల వివరాలను బహిర్గతం చేయాలని కోరుతున్నారు.

- సంయుక్త విచారణ చేపట్టాలి.. అక్రమాలుంటే చర్యలు తీసుకోవాలి..?

సింగిరెడ్డిపల్లి ఇసుక ర్యాంపునకు జారీ చేసిన అనుమతులు, జానంపేట రెవెన్యూ పరిధిలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న తవ్వకాలు, భూపతిరావుపేటలో ఇసుక నిల్వలు, రవాణా మార్గాలు, సొసైటీల ఆర్థిక లావాదేవీలపై మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అవసం ్మైతే సర్వే, జీపీఎస్ ఆధారిత క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి అనుమతుల పరిధిని, వాస్తవ తవ్వకాల ప్రాంతాన్ని నిర్ధారించాలని కోరుతున్నారు. గోదావరి ఇసుక సంపద ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదు.. అది ప్రజల సహజ వనరు. గిరిజన సొసైటీల అభివృద్ధి పేరుతో ఇతరుల వ్యాపార ప్రయోజనాలు నెరవేరుతు న్నాయా? సింగిరెడ్డిపల్లి పేరుతో అనుమతులు పొంది జానంపేట పరిధిలో తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణల్లో వాస్తవమెంత? భూపతిరావుపేటలో డంపింగ్‌కు అనుమతులు ఉన్నాయా? ఈ ప్రశ్నలకు సంబంధిత శాఖల విచారణతోనే సమాధానం లభించ ్నుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని, అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తెల్లం శరత్ హత్యతో అట్టుడికిన భద్రాద్రి

భద్రాచలం నవంబర్ 17 (జనంసాక్షి)

భద్రాచలం పట్టణంలో గిరిజన యువకుడు తెల్లం శరత్ (24) హత్యకు గురైన ఘటన తీవ్ర కలకలం రేపింది. రామాలయ పరిసరాల్లోని ఓ ప్రైవేటు లాడ్జిలో గది అద్దె విషయంలో తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీయగా, లాడ్జి సిబ్బంది దాడిలో శరత్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనను నిరసిస్తూ ఆదివాసీ సంఘాలు ఆందోళనకు దిగాయి. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టిపంపు గ్రామానికి చెందిన తెల్లం శరత్ తన స్నేహితులు కుర్సం ప్రశాంత్, కీసర కార్తీక్‌లతో కలిసి సోమవారం రాత్రి భద్రాచలానికి వచ్చాడు. రామాలయ పరిసరాల్లోని శ్రీ సత్యసాయి రెసిడెన్సీలో బస చేసేందుకు గది కావాలని అడిగారు. ఈ క్రమంలో గది అద్దె విషయంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో లాడ్జి సిబ్బంది యువకులపై విచక్షణారహితంగా దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన శరత్ లాడ్జి ఎదుట రోడ్డుపై కుప్పకూలిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, ఈ ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు లాడ్జి సిబ్బంది ప్రయత్నించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. శరత్‌పై దాడికి పాల్పడిన వ్యక్తుల్లో ఒకరిపై గతంలో యటపాక పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదై విచారణలో ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి పట్టణ పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

సబ్ కలెక్టర్, సీఐకి వినతి.. లాడ్జి ఎదుట ధర్నా

తెల్లం శరత్ హత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు



భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠను కలిసి వినతిపత్రం అందజేశారు. భద్రాచలం పరిసర ప్రాంతాల్లో ఆదివాసీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా ఆదివాసీ సమితి నాయకులు, మృతుడి కుటుంబ సభ్యులు పట్టణ సీఐ సట్ల రాజును కలిసి ఫిర్యాదు చేశారు. హత్య ఘటనపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి నిందితులందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఆదివాసీ సంఘాల నాయకులు శ్రీ సత్యసాయి రెసిడెన్సీ ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఆందోళనల నేపథ్యంలో ఘటన జరిగిన లాడ్జిని రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు.

కాలేజీల్లో మతవిద్వేష వ్యాఖ్యలు చేస్తే

సహించేది లేదు

- విద్యార్థి సంఘాల కార్యక్రమాలపై భజరంగ్‌దళ్ అభ్యంతరం
- ప్రిన్సిపాల్‌కు హెచ్చరిక



చింతపల్లి, నవంబర్ 17 (జనంసాక్షి)

విద్యాసంస్థల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారం పేరుతో మతవిద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని భజరంగ్‌దళ్, స్థానిక హిందూ సంఘాల నాయకులు హెచ్చరించారు. చింతపల్లి మండల కేంద్రంలోని అలుకా జహిందర్‌రెడ్డి జూనియర్ కళాశాలలో సోమవారం ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హిందూ దేవుళ్లు, అయ్యప్ప, శివుడు, ఆంజనేయస్వామి మాలధారణపై అవహేళన చేసేలా వ్యాఖ్యలు చేశారని భజరంగ్‌దళ్ నాయకులు ఆరోపించారు.ఈ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేసిన కొందరు విద్యార్థులను కార్యక్రమం అనంతరం బయటకు వెళ్లే సమయంలో బెదిరింపులకు గురిచేశారని వారు పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో ఇలాంటి వివాదాస్పద కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వకూడదని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కళాశాల యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రిన్సిపాల్‌కు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి హైందవ నాయకులతో పాటు వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అండర్-19 క్రీడల్లో సత్తా చాటిన గుడుగుంట్లపాలెం పాఠశాల విద్యార్థులు

నేరేడుచర్ల నవంబర్ 17 (జనంసాక్షి) :

మహాత్మా జ్యోతిబాపూలే సొసైటీ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయిలో దామరచర్లలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ లో మహాత్మా జ్యోతిబాపూలే గుడుగుంట్లపాలెం పాఠశాల చిల్లేపల్లి విద్యార్థులు అండర్-19 విభాగంలో జరిగిన పోటీలలో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు.వాలీబాల్ 2వ బహుమతి, హైజంప్ 2వ బహుమతి,800 మీటర్ల పరుగు 2వ బహుమతి,లాంగ్ జంప్ 3వ బహుమతి, విజేతలను పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, పీఈటీలు ప్రియదర్శిని,అరుణ,ఏటీపీ విజయకుమారి,డీడబ్ల్యూ రజని,ఉపాధ్యాయులు అభినందించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎంతో తోడ్పడతాయని అన్నారు. విజయం సాధించిన విద్యార్థులను మరింత ప్రోత్సహిస్తామని తెలిపారు.





పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: బీర్ల అయిలయ్య

ఆత్మకూరు (ఎం) నవంబర్ (17) జనంసాక్షి

మండల కేంద్రంలోని జేఎస్ గార్డెన్స్‌లో అర్హులైన లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మండలానికి చెందిన 600 మంది అర్హులైన లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. గౌడ్, చేనత , వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులైన వారికి చేయూత పెన్షన్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మండలానికి చెందిన 600 మంది లబ్ధిదారులకు ఒకేసారి నూతన పెన్షన్ మంజూరు కావడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ వేదికతో ప్రపంచ మార్కెట్‌లో పోచంపల్లి ఉత్పత్తులకు గుర్తింపు

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 17 (జనంసాక్షి):

పోచంపల్లి ఉత్పత్తులకు డిజిటల్ వేదిక ద్వారా ప్రపంచ మార్కెట్‌లో గుర్తింపు లభించే అవకాశాలు మెరుగుపడతాయని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని డైహౌస్‌లో తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో మంగళవారం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) డిజిటల్ సాధికారతపై ఓఎన్‌డీసీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి డిజిటల్ కామర్స్ ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలు, ఓఎన్‌డీసీ నెట్‌వర్క్ వినియోగం, డిజిటల్ మార్కెటింగ్, ఈ కామర్స్ సేవలు, ఆన్‌లైన్ వ్యాపార విస్తరణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా వ్యాపారవేత్తలు డిజిటల్ రంగంలోకి అడుగుపెట్టి తమ వ్యాపారాలను మరింత విస్తరించుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, పోచంపల్లి హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ప్రతినిధి భారత లవకుమార్, టై అండ్ డై అధ్యక్షుడు కర్నాటి బాలరాజు, జాయింట్ డైరెక్టర్ వి.ఎస్. రావు, అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్ కుమార్, ధీరావత్ వీరన్న, కల్పనా రావు, సురేష్ బాబు, సిటీ యూనియన్ బ్యాంక్ ప్రతినిధి పణీంద్ర, అనురాధ, కర్నాటి శాంతి, ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సహకారంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు

ట్రాఫిక్ నియంత్రణకు అఖిలపక్ష సమావేశం : మున్సిపల్ చైర్మన్ కొణతం చిన వెంకట్ రెడ్డి

నేరేడుచర్ల నవంబర్ 17 (జనంసాక్షి):

ట్రాఫిక్ నియంత్రణ అనేది కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదు,ప్రతి పౌరుడి బాధ్యత కూడా. ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ కొణతం చిన వెంకట్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను నియంత్రించడం,పట్టణంలో రహదారి భద్రతను మెరుగుపరచడం,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేపట్టడం లక్ష్యంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ కొణతం వెంకట రెడ్డి,అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాన రహదారులు, కూడళ్లు, మార్కెట్ ప్రాంతాల్లో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలపై చర్చించి ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై సూచనలు చేస్తూ, ప్రధాన రహదారులపై వాహనాల పార్కింగ్ క్రమబద్ధీకరణ, రహదారులపై ఆక్రమణల తొలగింపు,పాదచారులకు



ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడం, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై చర్చించారు.పట్టణ అభివృద్ధి, ప్రజల సౌకర్యం, రహదారి భద్రత దృష్ట్యా అన్ని రాజకీయ పార్టీలు, వ్యాపారులు, ప్రజలు సమన్వయంతో సహకరించాలని సమావేశంలో కోరారు.ట్రాఫిక్ సమస్యల శాశ్వత పరిష్కారానికి సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి, మున్సిపల్‌కమిషనర్, చెన్నబోయిన నాగరాజు, ఎస్ఐ.గోపాల్ రెడ్డి, తహశీల్దార్ సురిగి సైదులు,హైవే ఏఈ, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అలక శ్రవణ్ రెడ్డి,మాజీ మున్సిప చైర్మెన్ చందమల్ల జయబాబు, బచ్చలకూరి ప్రకాష్, వివిధ పార్టీల నాయకులు దొండపాటి అప్పిరెడ్డి, ,నాగండ్ల శ్రీధర్, ధనుంజయ నాయుడు, నాగేష్, ప్రజాప్రతినిధులు,వ్యాపార సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి



ప్రతి విద్యార్థి కనీస సామర్థ్యాలను సాధించాలి డీఈఓ సుశిందర్ రావు

గుర్రంపోడు, నవంబర్ 17, (జనంసాక్షి)

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి కనీస అభ్యసన సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని జిల్లా విద్యాధికారి (డీఈఓ) సుశిందర్ రావు సూచించారు. మంగళవారం మండలంలోని పాల్వాయి, తేనేపల్లి ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని (కేజీబీవీ) ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ సుశిందర్ రావు నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. వారి చదువు తీరును తెలుసుకునేందుకు పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలు వేసి, వారి వద్ద నుంచి జవాబులు రాబట్టడం ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమైన డీఈఓ సుశిందర్ రావు పలు కీలక సూచనలు చేశారు. తరగతిలో చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి మెరుగైన బోధన అందించాలని ఆదేశించారు. ప్రాథమిక విద్యా బలోపేతానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని, వంటల విషయంలో తప్పనిసరిగా ప్రభుత్వ మెనూను పాటించాలని స్పష్టం చేశారు. పాఠశాలల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రమణ, వహిదుద్దీన్, అనిత, హేమలత, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ జలాల తరలింపుపై

కాంగ్రెస్ ప్రభుత్వ మౌనమేంటి?

బీఆర్ఎస్ నేత పీజీఆర్



గుర్రంపోడు, నవంబర్ 17, (జనంసాక్షి)

నాగార్జునసాగర్ జలాలను తాగునీటి అవసరాల ముసుగులో టన్నెల్ మార్గం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిశ్చబ్దంగా ఉండటంపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పీజీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సుమారు రూ. 1,200 కోట్ల వ్యయంతో 'అమరజీవి జలపథకం' పేరుతో సాగర్ డెడ్ స్టోరేజీ నుంచి సైతం నీటిని తోడుకునేలా రహస్యంగా టన్నెల్ నిర్మిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, ఇది తెలంగాణ నీటి హక్కులకు తీవ్ర భంగం కలిగించే చర్య అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై పీజీఆర్ మాట్లాడుతూ, "తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై లేదా? ఏపీ ప్రభుత్వం నీటిని తరలిస్తుంటే ఎందుకు అడ్డుకోవడం లేదు?" అని ప్రశ్నించారు. ముఖ్యంగా నల్గొండ జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి (నల్గొండ ఎమ్మెల్యే) ఈ జలదోపిడీపై స్పందించకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. జిల్లా ప్రజల ప్రయోజనాలు, రైతాంగం సాగునీటి హక్కుల విషయంలో మంత్రి బాధ్యతగా వ్యవహరించాలని, కళ్లుమూసుకుని ప్రభుత్వాన్ని నడుపుతున్నారా అని నిలదీశారు. నీళ్లు, నిధులు, నియామకాలు ప్రధాన లక్ష్యాలుగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నీటి వాటా విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని పీజీఆర్ స్పష్టం చేశారు. నాగార్జునసాగర్ జలాల తరలింపు అంశంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వాస్తవ పరిస్థితులను ప్రజలకు వెల్లడించాలని, తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

నూతన చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ

చౌటుప్పల్ నవంబర్ 17(జనంసాక్షి)



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన చేయూత పెన్షన్ పథకం ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఇంచార్జ్ ఇప్ప వెంకటేష్, డీసీసీ కార్యదర్శి బత్తుల లింగస్వామి గౌడ్, వార్డ్ అధ్యక్షులు పోతంశెట్టి భాస్కర్ మరియు ఇతర స్థానిక నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలోని గుడిపల్లి పోలీస్ స్టేషన్ బాధ్యతలు చేపట్టిన ఎస్సై బి.రాజు కు కాంగ్రెస్ పార్టీ సర్పంచులు మంగళవారం నాడు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఆయనను సన్మానించిన వారిలో అంగడిపేట సర్పంచ్ రమావత్ చిరంజీవి, అక్కంపల్లి సర్పంచ్ మద్దిమడుగు వినోద్, పెద్దగుమ్మడం సర్పంచ్ బొమ్ము వెంకటేష్,బాలాజీ నగర్ సర్పంచ్ మేగావత్ కిషన్ నాయక్, పుట్టంగండి సర్పంచ్ రమా ఉన్నారు.



నూతన ఎస్సై బోదాసు రాజుకు ఘన సన్మానం

శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

పి.ఏ.పల్లి,నవంబర్ 17(జనంసాక్షి):

ఉమ్మడి పి.ఏ.పల్లి మండలం గుడిపల్లి పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన బోదాసు రాజును బీఆర్ఎస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజుకు శుభాకాంక్షలు తెలియజేసి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాల బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచులు కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి, రమావత్ కిషన్,కీరు నాయక్,పార్టీ నాయకులు మాద సుధాకర్ గౌడ్,రమావత్ శ్రీను,వంగాల కృష్ణా రెడ్డి,మునావత్ కోటి,మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

తల్లాడ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్

ఖమ్మం టౌన్, నవంబర్ 17 (జనంసాక్షి):

తల్లాడ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ, పెండింగ్ కేసుల వివరాలు, దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు, సిబ్బంది పనితీరును సమీక్షించి ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని అధికారులకు సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్‌లో వస్తున్న ఆధునిక విధానాలను సిబ్బంది అందిపుచ్చుకోవాలని తెలిపారు. రౌడీషీటర్లకు సమర్థవంతంగా కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు వారిపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సెక్టార్ అధికారులు, పోలీస్ సిబ్బందితో కమిషనర్ మాట్లాడారు.





అఖిల భారత యాదవ సంఘం మండల నూతన కమిటీ నియామకం

చింతలపాలెం(జనంసాక్షి)

అఖిల భారత యాదవ మహాసభ సూర్యాపేట జిల్లా శాఖ ఆధ్వర్యం లో చింతలపాలెం మండల నూతన కమిటీని మండలంలోని 16 గ్రామాల నుండి 100 మందికి పైగా యాదవ సంఘం ముఖ్య నాయకులని ఘనంగా ఎన్నుకోవడం జరిగిందని నియోజకవర్గ అధ్యక్షులు జక్కుల మల్లయ్య యాదవ్ అన్నారు. అనంతరం నూతన కార్యవర్గానికి నియామక పత్రాలు అందజేశారు. నూతన కమిటీ అధ్యక్షులుగా మునగ చిన్న వీరబాబు, ఉపాధ్యక్షులుగా కుంటి గొర్ల లింగయ్య,ప్రధాన కార్యదర్శి బడుగుల శ్రీనివాస్,ట్రెజరర్ గా దాసరి లింగారావు లను ఎన్నుకోవడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పొలినేడి శ్రీనివాసరావు,జక్కుల శంబయ్య,జాల గురవయ్య, జక్కుల జయరాం,పండగ కొరివేరయ్య, జక్కుల రమేష్,పాశం వెంకట్ నారాయణ,దొండపాడు సర్పంచ్ చెన్నకేసి వెంకయ్య, చింతిర్యాల సర్పంచ్ సకినాల తిరపత రావు, అంజనేయులు, రామారావు, చిర్ర శ్రీనివాస్, లింగరాజు,నరసింహారావు, పి వీరబాబు, రాంబాబు,సాయి తదితరులు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. అనంతరం అధ్యక్షుడు వీరబాబు మాట్లాడుతూ ఈ ఎన్నికకు సహకరించిన వారికి ధన్యవాదములు తెలుపుతూ యాదవ సమాజ ఐక్యత కోసం, సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేస్తానని తెలిపారు.

పాల్వంచ మండలంలో అక్రమ ఇసుక రవాణాకు చెక్

ట్రాక్టర్ స్వాధీనం, వ్యక్తి అదుపులోకి!

కొత్తగూడెం క్రైమ్, నవంబర్ 17 (జనంసాక్షి):



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను పాల్వంచ రూరల్ పోలీసులు మంగళవారం సాయంత్రం పట్టుకున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న వాహనంతో పాటు సుమారు రూ. 4,000 విలువైన ఇసుకను, ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాల్వంచ రూరల్ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు.. నవంబర్ 17న సాయంత్రం సుమారు 4:00 గంటల ప్రాంతంలో పోలీసులు సంగం గ్రామ శివారులో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను గుర్తించి ఆపి తనిఖీ చేయగా, దానిని నడుపుతున్న తమ్మల్ల వెంకట దుర్గాప్రసాద్ (30)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు పలు కీలక విషయాలు వెల్లడించాడు. తన తండ్రి పేరు మీద ఉన్న 'ఐషర్ 480' ((EICHER 480) ట్రాక్టర్‌పై దంతలబోర గ్రామ శివారులోని ముర్రేడు వాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా ట్రాలీలో నింపుకున్నట్లు తెలిపాడు. ఆ ఇసుకను పాల్వంచ ప్రాంతానికి తీసుకువచ్చి విక్రయించేందుకు ప్రయత్నిస్తు న్నట్లు నిందితుడు అంగీకరించాడు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, పంచుల సమక్షంలో ఇసుకతో కూడిన ట్రాక్టర్ మరియు ట్రాలీని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై చట్టరీత్యా తదుపరి చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల హెచ్చరిక:

ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరపడం, రవాణా చేయడం లేదా విక్రయాలకు పాల్పడటం చట్టరీత్యా నేరమని పాల్వంచ రూరల్ పోలీసులు హెచ్చరించారు. సహజ వనరులను దోచుకునే వారిపై, నిబంధనలను ఉల్లంఘించే వారిపై భవిష్యత్తులోనూ ఉక్కుపాదం మోపుతామని, కఠిన చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు.



గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర ఎంతో కీలకం

నూతన కమిటీకి అభినందనలు తెలిపిన రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

సూర్యాపేట(జనంసాక్షి):
జిల్లా కేంద్రంలోని వైట్ హౌస్‌లో ఏఐసీసీ సభ్యులు, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల శాసనమండలి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తూముల భుజంగరావు ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన పెన్ పహాడ్ మండల సర్పంచుల ఫోరం కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర ఎంతో కీలకమని, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుంటూ,గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని



కోరారు.నూతన బాధ్యతలు చేపట్టిన ప్రతి ఒక్కరికీ మంచి విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు. అధ్యక్షులుగా గాజులమల్కాపురం సర్పంచ్ నాతాల వెంకటరెడ్డి,ప్రధాన కార్యదర్శిగా ఇటుకల శ్రీను, ఉపాధ్యక్షులుగా ముత్తినేని శ్రీను, భూక్య జామా నాయక్, ఒగ్గు రవి,కార్యదర్శిగా పొనుగంటి నరేందర్ నాయుడు,కోశాధికారిగా ధారావత్ కవిత రవీందర్ నాయక్ ను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్ లు గార్లపాటి స్వర్ణ శ్రీనివాస్ రెడ్డి, లచ్చి రామ్ నాయక్, నన్నెపంగ కమలమ్మ, కొండేటి మౌనిక పవన్, ఒగ్గు కిరణ్, వసంత శ్రీనివాస్, చందు లాల్, మేకపోతుల లింగయ్య, హుస్సేన్, అనుములపూరి నాగయ్య, వెంకటేశ్వర్లు, శోభ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చేనేత విశిష్టతను తెలుసుకున్న కృష్ణవేణి విద్యార్థులు

రామన్నపేట, నవంబర్ 17 (జనంసాక్షి):
పుస్తకాలకే పరిమితం కాకుండా విద్యార్థులకు ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతో రామన్నపేటలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. చేనేత వస్త్రాలు చేనేత ఉత్పత్తులపై అవగాహన కల్పించేందుకు హైస్కూల్ విద్యార్థులను మంగళవారం రామన్నపేట పద్మశాలి కాలనీలోని పలు చేనేత కుటుంబాలలో నిర్వహించే పనులను సందర్శించే విధంగా ఫీల్డ్ వర్క్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్శనలో భాగంగా విద్యార్థులు నేరుగా చేనేత కార్మికుల వద్దకు వెళ్లి నోరు తయారీ, మగ్గం నడిచే విధానం, చేనేత చీరలు దోవతులు ఇతర ఉత్పత్తుల తయారీ విధానం గురించి స్వయంగా చూసి తెలుసుకున్నారు. పలువురు నేత కార్మికులు విద్యార్థులకు మగ్గం పని తీరు వివరిస్తూ చేనేత వస్త్రాల ప్రత్యేకతను వివరించారు. యంత్రాలతో తయారయ్యే వస్త్రాలకు చేతితో నేసిన వస్త్రాలకు నా తేడాను విద్యార్థులు వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి. సురేష్, ఉపాధ్యాయులు ఎండి. అలీముద్దీన్, కే లావణ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా శ్రీరామ భజన మండలి భజన కార్యక్రమం

భక్తిశ్రద్ధలతో భజనలు ఆలపించిన సభ్యులు.. సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపిన శాలివాహన భజన బృందం

పి.ఏ.పల్లి,నవంబర్ 17(జనంసాక్షి):
పి.ఏ.పల్లి గ్రామంలోని శ్రీరామ భజన మండలి ఆధ్వర్యంలో గత నెల రోజులుగా నిర్వహించిన భజన శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా నిన్న సాయంత్రం 6:30 గంటలకు గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక భజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భజన మండలి సభ్యులు భక్తిశ్రద్ధలతో వివిధ భజనలు ఆలపించి భక్తులను ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై భజనలను ఆసక్తిగా ఆలకించారు.నెల రోజుల పాటు భజన నేర్చుకొని ముగింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సభ్యులను గ్రామస్తులు అభినందించారు.ఈ భజన కార్యక్రమానికి సహకారం అందించిన దాతలకు పాల్వాయి వెంకట్ రెడ్డి,స్థానిక సర్పంచ్ వంగాల శ్రీనివాస్ రెడ్డి,అలుగుబెల్లి శ్రీనివాస్ రెడ్డి, కూడికల్ల శేఖర్ తదితర దాతలకు శ్రీరామ భజన మండలి సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తెరాటిగూడెం గ్రామానికి చెందిన కత్తి స్వాతికి జేఎన్టీయూహెచ్ డాక్టరేట్

నల్లగొండ,నవంబర్ 17,(జనంసాక్షి):



నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం తెరాటిగూడెం గ్రామానికి చెందిన కత్తి గోవర్ధన్ రెడ్డి కుమార్తె కత్తి స్వాతి డాక్టరేట్ పట్టా పొందేందుకు అర్హత సాధించారు. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూహెచ్) లో నిర్వహించిన వైవా వోస్‌ను విజయవంతంగా పూర్తి చేశారు.సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న కత్తి స్వాతి, జేఎన్టీయూహెచ్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ జి. నరసింహ పర్యవేక్షణలో తన పరిశోధనను పూర్తి చేశారు.”ఆన్ ఎఫిషియంట్ డీప్ లెర్నింగ్ మోడల్ విత్ ఫీచర్ ఆప్టిమైజేషన్ ఫర్ ఇంటలిజెంట్ నెట్వర్క్ ట్రాఫిక్ అనాలసిస్” అంశాలపై ఆమె పరిశోధన సాగింది. ఈ అంశంపై పరిశోధనా సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించి, వైవా వోస్‌ను విజయవంతంగా పూర్తి చేయడంతో డాక్టరేట్ పట్టా పొందేందుకు అర్హత సాధించారు.తెరాటిగూడెం గ్రామానికి చెందిన కత్తి స్వాతి ఉన్నత విద్యారంగంలో డాక్టరేట్ సాధించే స్థాయికి చేరుకోవడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది ఆమెను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పరిశోధనలు చేపట్టి విద్యారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి

భద్రాచలం నవంబర్ 17 (జనంసాక్షి)



భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం సాయంత్రం విషాదకర ఘటన చోటుచేసుకుంది. మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొనడంతో 84 ఏళ్ల వృద్ధురాలు మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మణుగూరు మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన మైపాల్ లాలమ్మ (84) ములుగు నుంచి బస్సులో ప్రయాణించి భద్రాచలం చేరుకుంది. బస్టాండ్‌లో బస్సు దిగి అక్కడే నిలబడి ఉండగా, ప్రయాణికులను దింపి ప్లాట్‌ఫామ్‌పైకి వస్తున్న మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లాలమ్మ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాలకు ప్రభుత్వం ప్రాధాన్యత

చేయూత పింఛన్ మంజూరు పత్రాలను అందజేసిన సర్పంచ్ అందుగుల సువర్ణ

కనగల్లు, నవంబర్ 17 (జనంసాక్షి)
ప్రజా పాలనలో ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రధమ ప్రాధాన్యత ఇస్తుందని మాజీ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండలంలో రామచంద్రాపురం, కనగల్లు, బోయినపల్లి, ధర్వేశిపురం గ్రామాలలో అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులు, వికలాంగులకు మంజూరైన పింఛన్ల పత్రాలను ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి ఆయన లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. రామచంద్రాపురంలో ఏర్పాటుచేసిన గ్రామసభ లో స్థానిక సర్పంచ్ అందుగుల సువర్ణ మాట్లాడుతూ నిరుపేదలకు, ఎలాంటి ఆదరణ లేని ఒంటరి మహిళలు, వృత్తులపై ఆధారపడి వయసు పైబడిన కార్మికులకు చేయూత పింఛన్ అందజేసి వారి కుటుంబానికి ఆర్థిక భరోసాని కల్పిస్తుందని పేర్కొన్నారు. భూమిలేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ బీమా పథకాన్ని ఈనెల 19 నుంచి అమలు చేస్తుందని గ్రామాలలో భూమిలేని నిరుపేదలు ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలని గుర్తు చేశారు. పార్టీలకతీతంగా అర్హత ఉండి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి పింఛన్ ఇవ్వడం జరుగుతుందని ప్రతిపక్ష పార్టీల నాయకుల మాటలను నమ్మవద్దని సూచించారు. ఎల్ ని నో ప్రభావం కారణంగా వర్షాలు సమృద్ధిగా పడకపోవడంతో బోరు బావులలో భూగర్భ జలాలు అడగండి నీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉన్నం దున నీటిని వృధా చేయకుండా పొదుపు గా వాడుకోవాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు. వి బి జి రాంజీ పథకం ద్వారా ప్రతి రైతు తమ భూములలో పత్తి కుంటలు నిర్మించుకోవాలని, గ్రామంలో 31 కుటుంబాలకు ఇంకుడు గుంతలు మంజూరి కాగా వీటి నిర్మాణానికి ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అనుపు రెడ్డి, ఆత్మ చైర్మన్ గోలి జగాల్ రెడ్డి, ఆర్టిఏ జిల్లా సభ్యులు కుసుకుంట్ల రాజిరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ జి బిక్షం యాదవ్, మాజీ జెడ్పిటిసి చిట్ల వెంకటేశం సర్పంచులు నర్సింగ్ మురళీధర్ గౌడ్, వంపు నాగమణి జానయ్య, రాయల శేఖర్, ఉఎ సర్పంచ్ లుబల్గురి శేఖర్,





మండలి చంద్రయ్య, బిక్షాల మహేష్, కో మ్మగోని జానకమ్మ మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి హఫీజ్, ఎండి జియావుద్దీన్ కాంగ్రెస్ యువజన నాయకులు అందుగుల వెం కటేశం పంచాయతీ కార్యదర్శి వీరబాబు,మాజీ సర్పంచులు పద్మ, నరసింహా, లక్ష్మయ్య, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు రాజా, శంకర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో యోగా కార్యక్రమం

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 17 (జనంసాక్షి)
జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఖమ్మం ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో యోగా కార్యక్రమం నిర్వహించారుఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, యోగా ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందుతాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్రీమతి పి. పద్మజ, గ్రేడ్-1 లైబ్రేరియన్ చి. మాల్సూర్, గ్రేడ్-3 లైబ్రేరియన్లు బాబు, వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ పి. సంతోష్ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అర్హులకే సంక్షేమ పథకాలు

చేయూత పథకంతో పేదలకు భరోసా: ఏఎంసీ చైర్‌పర్సన్ తిరుపతమ్మ

నడిగూడెం (జనంసాక్షి) :
ప్రభుత్వ పథకాల అమలులో రాజకీయాలకు తావులేకుండా అర్హులైన పేదలందరికీ ప్రాధాన్యమిస్తున్నామని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఏపూరి తిరుపతమ్మ సుధీర్ తెలిపారు. మంగళ వారం నడిగూడెం మండలంలోని కరివి రాల, రత్నవరం గ్రామాల్లో పర్యటించిన ఆమె.. చేయూత పథకం కింద కొత్తగా పింఛన్లు మంజూరైన వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతమ్మ మాట్లాడుతూ పేద కుటుంబా లకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. గత పాలనలో సంక్షేమ పథకాల పంపిణీ అధికార పార్టీకి అను కూ లంగా సాగిందని విమర్శించారు. ప్రస్తుతం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. చేయూత పింఛన్ల మొత్తాన్ని భవిష్యత్తులో రెట్టింపు చేసే దిశగా ప్రభుత్వం



ఆలోచిస్తోందని తెలిపారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు సహకరించాలని కోరారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన అవకతవకలను ప్రజలు మరచిపోలేదని, రాబోయే రోజుల్లో టీఆర్ఎస్‌కు ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మొక్క బిక్షపతి, జిల్లా కార్యదర్శి, కరివిరాల మాజీ సర్పంచ్ గుర్రం నీలిమ గాంధీ, సర్పంచులు నాగేశ్వరరావు, దున్న శ్రీనివాస్, రాజేష్, సోమయ్య, నాయకులు లింగారెడ్డి, నాగేశ్వరరావు, బడేటి వెంకటేశ్వర్లు, బాణాల నాగరాజు, కాసాని శివకృష్ణ, సోమాగాని రవి, పగడాల ప్రభాకర్ రెడ్డి, పి.విజయ వర్ధన్ బాబు, సోమ వీరయ్య, పల్లపు శ్రీనివాసు, విజయ రామారావు, ఉపసర్పంచ్ , వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వీబీ-జీ-రామ్-జీ పనులను పరిశీలించిన డిఆర్డిఓ సన్యాసయ్య

పెన్ పహాడ్,నవంబర్ 17 (జనం సాక్షి) :
మండల పరిధిలోని దోసపహాడ్, అనంతారం గ్రామపంచాయతీలలో జరుగుతున్న వీబీ-జీ-రామ్-జీ పనులను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి (డిఆర్డిఓ) సన్యాసయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఫీడర్ ఛానల్, రోడ్డు ఫార్మేషన్ పనులను పరిశీలించి రైతులు, కూలీలతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మన్నికైన పనులు, ఉత్పాదకత, సామాజిక ఆస్తుల సృష్టికి ప్రాధాన్యతనిస్తూ గ్రామీణ మౌలిక వసతుల కల్పనకు తోడ్పడాలన్నారు. ఎల్ నినో ప్రభావం దృష్ట్యా భూగర్భ జలాలు అడుగంటుతున్నందున రైతులు తమ భూమిలో పంట కుంట, ఊరికి ఊట కుంట, ఇంటికి ఇంకుడు గుంత, బోర్ వెల్ రీచార్జ్ స్ట్రక్చర్ లు, కమ్యూనిటీ ఇంకుడు గుంటలు నిర్మించుకుని భూగర్భ జలాల



పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. రైతులు నీటి సంరక్షణ పనులకు ఆర్థిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అదేవిధంగా వీబీ-జీ-రామ్-జీ పథకం ద్వారా పశుగ్రాసం కొరకు గడ్డి పెంపకం, పందిరి కూరగాయల సాగు, పశువుల కొట్టములు, పశువులకు నీటి తొట్టెల నిర్మాణం పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో డిఆర్డిఓతో పాటు ఏపీవో రవి, సాంకేతిక సహాయకులు వెంకటేశ్వర్లు, బుచ్చన్న, క్షేత్ర సహాయకులు వెంకటేష్, బేగం పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పాలనకు కుంకుడు పాములే సాక్ష్యం

ఎమ్మెల్యే వేముల వీరేశంకు గ్రామస్తుల ఘన సన్మానం, కృతజ్ఞతలు

రామన్నపేట, నవంబర్ 17 (జనంసాక్షి):
ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు కుంకుడు పాముల గ్రామంలో సాకారమయ్యాయి. ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవతో, ప్రభుత్వ సహకారంతో గ్రామంలో నూతనంగా 18 మంది నిరుపేదలకు పెన్షన్లు, 18 కుటుంబాలకు ఇండ్లు, 28 కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరయ్యాయి.అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఇది నిదర్శనమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పెన్షన్లు, ఇండ్లు, రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. పేదలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వానికి, ఎమ్మెల్యే వేముల వీరేశంకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. రామన్నపేట ఎంపీడీవో ఏ రాములురామన్నపేట మండల అధ్యక్షులు పున్న జగన్మోహన్ సింగిల్ విండో చైర్మన్ నంద్యాల భిక్షం రెడ్డిమార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకటరాజి రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నాతి పరశురాములు గౌడ్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, రానున్న రోజుల్లో గ్రామాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజల వద్దకే చేరుతుండటం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ



కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ శిరీషకాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మమ్మద్ జమీరుద్దీన్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఎండి అక్రమ్ నల్ల శ్రీనివాస్ రెడ్డి, బొక్క జయచంద్ర రెడ్డి, బొక్క జగన్మోహన్ రెడ్డి, నాతి స్వామి, మిట్టగడపుల రవి, బాసాని యాదగిరి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి పుట్టినరోజు సందర్భంగా అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ

స్వామివారి ఆశీస్సులు పొందిన అయాన్ష్ నాయక్

దేవరకొండ, నవంబర్ 17 (జనంసాక్షి):
దేవరకొండ పట్టణంలోని శ్రీ హరిహరసూత అయ్యప్ప స్వామి దేవాలయంలో మంగళవారం చిన్నారి నేనావత్ అయాన్ష్ నాయక్ పుట్టినరోజు సందర్భంగా అయ్యప్ప స్వాములకు ఒకరోజు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు నేనావత్ నాగార్జున నాయక్ సోదరుడు నేనావత్ శివ నాయక్ పెద్ద కుమారుడైన అయాన్ష్ నాయక్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, చిన్నారి అయాన్ష్ నాయక్‌కు స్వామివారి ఆశీర్వచనంతో పాటు అభివస్త్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.



సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ ను పునరుద్ధరించాలి

టీఎస్ సీపీఎస్ఈయు జిల్లా అధ్యక్షులు లక్కపాక ప్రవీణ్ కుమార్

సూర్యాపేట(జనంసాక్షి):
సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్ సిపిఎస్ఈయు జిల్లా అధ్యక్షులు లక్కపాక ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.మంగళవారం టీఎస్ సీపీఎస్ఈయు రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయం ఎదురుగా సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానంను పునరుద్దరించాలని కోరుతూ ధర్మదీక్షను చేపట్టారు.ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా అధ్యక్షులు లక్కపాక ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ సీపీఎస్ రద్దు మూడు సంవత్సరాలైన జరగకపోవడం బాధాకరమని అన్నారు.వెంటనే సీపీఎస్ రద్దుకు చర్యలు చేపట్టాలన్నారు. సీపీఎస్ విధానంతో ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా లేదన్నారు.ఉద్యోగుల పదవీ విరమణ అనంతర జీవితానికి ఆర్థిక భద్రత కల్పించాలంటే పాత పెన్షన్ విధానాన్ని తిరిగి అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ధర్మదీక్ష విజయవంతం అయిందని, సహకరించిన ఉపాధ్యాయ ఉద్యోగస్తులందరికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బదుగుల సైదులు, జిల్లా కోశాధికారి గుయ్యని ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ యూసుఫ్, నారాయణ సతీష్ కుమార్ మణి, ఖాసీం, వెంకటేశ్వర్లు, సుధాకర్, గోపిరెడ్డి, వీరారెడ్డి, జయంత్, బెల్లంకొండ సైదులు, నేతికండ్ల విజయ్, సుభాష్ చంద్రబోస్, శ్రీధర్, లింగరాజు, ఎర్రమళ్ళ శ్రీను, సుధాకర్, జయశ్రీ, రేణుక, వివిధ శాఖల సీపీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.



విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పురిల్లు దగ్ధం

జనంసాక్షి (మిర్యాలగూడ):
విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూర్లిల్లు దగ్ధమైన సంఘటన మిర్యాలగూడ మండల పరిదిలోని జేత్యాతండా గ్రామపంచాయతీ లో చోటుచేసుకున్నది. మంగళవారం ఉదయం 8.30గంటలకు జేత్యాతండా గ్రామం లో మాలోత్ స్వామి తండ్రి రామ్లా కి చెందిన పూరిల్లు ఇంట్లో ఎవ్వరు లేని సమయం లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు అంటుకొని ఇంట్లో ఉన్నా సామాను మొత్తం కాలి పోయాయి. సుమారు రెండు లక్షల రూపాయల విలువైన వస్తువులు కాలిపోయాయి. సమాచారం అందుకున్న మిర్యాలగూడ రూరల్ పోలీసులు, రెవిన్యూ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను పరిశీలించి వివరాలను నమోదు చేసున్నారని బాధితులు తెలియజేశారు. ప్రభుత్వం తమకు తక్షణ సహాయం అందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితులు వేడుకున్నారు.



సిపిఎస్ ఉద్యోగుల సామూహిక సెలవు ధర్మదీక్ష విజయవంతం

మేనిఫెస్టో లో హామీ ఇచ్చిన విధంగా వెంటనే సిపిఎస్‌ను రద్దు చేయాలి : తుక్కాని శ్రీనివాసరెడ్డి అధ్యక్షుడు టి ఎస్ సి పి ఎస్ ఇ యు భద్రాద్రి

కొత్తగూడెం క్రైమ్ ,నవంబర్ 17(జనంసాక్షి)

సిపిఎస్ ను రద్దు చేస్తామన్న ప్రభుత్వ హామీ నిలబెట్టుకోవాలి కాంగ్రెస్ మేనిఫెస్టోను గౌరవించి సిపిఎస్ వెంటనే రద్దు చేయాలి. కాంగ్రెస్ పార్టీ సాధారణ ఎన్నికల ముందు మాట ఇచ్చి మ్యానిఫెస్టో పెట్టిన విధంగా వెంటనే సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని టి ఎస్ సి పి ఎస్ ఇ యు భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు శ్రీ తుక్కాని శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. టీఎస్ సీపీఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని సిపిఎస్ ఉద్యోగు ఉపాధ్యాయులు నేడు సామూహిక సెలవులు పెట్టి 33 జిల్లా కేంద్రాల్లో ధర్నా చౌక్లో ధర్మదీక్షలు చేసే కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి జిల్లాలోని సుమారు 2000 సిపిఎస్ ఉద్యోగు ఉపాధ్యాయులు సామూహిక సెలవులు పెట్టి కలెక్టరేట్ ప్రాంగణంలోని ధర్నా చౌక్ లో ధర్మదీక్ష చేశారు.ఈ ధర్మదీక్ష కార్యక్రమం లో భద్రాద్రి జిల్లాలోని అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు నాయకులు పాల్గొని సంఘీభావం తెలియజేశారు. ఈ ధర్మదీక్ష కార్యక్రమం టి ఎస్ సి పి ఎస్ ఇ యు జిల్లా అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 2023 సాధారణ ఎన్నికల ముందు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ సభలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంను ఏర్పాటు చేస్తే వెంటనే సిపిఎస్ మీరు రద్దుచేసి పాత పెన్షన్ ని పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడమే కాకుండా కాంగ్రెస్ మేనిఫెస్టోలో కూడా పొందుపరచడం జరిగింది. ప్రభుత్వం ఏర్పాటు చేసి మూడు సంవత్సరాలు అయినా ప్రభుత్వం నుండి సిపిఎస్ రద్దు దిశగా ఎలాంటి అడుగులు పడకపోవడం చే జూలై 11 నుంచి టి ఎస్ సి పి ఎస్ ఇ యు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ స్థిత ప్రజ్ఞ భద్రాద్రి జిల్లాలోని భద్రాచలం రాములవారి పాదాల నుండి సిపిఎస్ రద్దు కోరుతూ జన జాగరణ పేరుతో 33 జిల్లాల మీదుగా బస్సు యాత్ర చేయడం జరిగింది. ఈ జన జాగరణ యాత్రలో తెలంగాణ లోని సుమారు వందమంది ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలను కలిసి సిపిఎస్ ను రద్దు కోరుతూ వినతి పత్రాలు అందించడం జరిగింది. జన జాగరణ యాత్ర ముగింపు సందర్భంగా ఆగస్టు 23న వేలాదిమంది సిపిఎస్ ఉద్యోగు ఉపాధ్యాయులతో లాల్ బహుదూర్ స్టేడియంలో జన జాగరణ సభను చేయడం జరిగింది. ఈ సభలో రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ కాంగ్రెస్ నవంబర్ 17 లోపు సిపిఎస్ రద్దు పై ప్రభుత్వం నిర్ణయం తీసుకోపోతే నవంబర్ 17న రాష్ట్రంలోని సిపిఎస్ ఉద్యోగు ఉపాధ్యాయులు అందరూ సామూహిక సెలవు పెట్టి ధర్మదీక్షలు చేస్తామని చెప్పడం జరిగింది. అయినా ఇప్పటివరకు ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేకపోవడం చే ఈరోజు భద్రాద్రి జిల్లాలోని సామూహిక సెలవాలు పెట్టి ధర్మదీక్ష చేస్తున్నామని తెలియజేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఇచ్చిన మాట ప్రకారం వారి మేనిఫెస్టోని గౌరవించి వెంటనే సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు లేకపోతే అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని సిపిఎస్ ని రద్దు చేసే వరకు ఉద్యమా న్ని ఉధృతం చేస్తామని





తెలియజేశారు.

తీర్మానాలు

ఈ ధర్మదీక్ష సభ సాక్షిగా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి గారు సిపిఎస్ ఉద్యోగుల ఉపాధ్యాయుల చప్పట్ల మధ్య ఈ క్రింది తీర్మానాలు చేయడం జరిగింది.

1) మేనిఫెస్టోలో పెట్టిన విధంగా వెంటనే సిపిఎస్ని రద్దు చేయాలి సిపిఎస్ రద్దు కమిటీలో టీఎస్ సి పీ యస్ కు ప్రాతినిధ్యం కల్పించాలి.

2)న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీములో రిటైర్ అయిన సిపిఎస్ ఉద్యోగులకు కూడా ట్రీట్మెంట్ కొనసాగించాలి. ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ట్రస్ట్ బోర్డ్ లో సిపిఎస్ సంఘానికి ప్రాతినిధ్యం కల్పించాలి.

3)సిపిఎస్ ఉద్యోగుల డి ఏ బకాయిలు ఏక మొత్తంలో నగదు రూపంలో చెల్లించాలి.

రాబోయే డీఏ, పిఆర్సి ఏరియాస్ ని కూడా ఏక మొత్తంలో నగదు రూపంలో చెల్లించాలి. ఈ ధర్మదీక్ష కార్యక్రమంలో టిఎస్ సీపీఎస్సీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాష్ట్ర ఐ టి సెల్ కార్యదర్శి గోరింట్ల సురేష్,రాష్ట్ర కార్యదర్శి నాగు నాయక్ జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ,మహిళా ఉపాధ్యక్షురాలు మంజు శ్రీ తో పాటు జిల్లా బాధితులు 23 మండలాల బాధ్యులు పాల్గొన్నారు. టి ఎస్ టి టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్ టీజీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్ పిఆర్టియు టీజీ జిల్లా అధ్యక్షుడు రవి, టిజిఎల్ఏ జిల్లా అధ్యక్షుడు టీజీవో ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ సెక్రటరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కిరణ్, సతీష్ లు, పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షుడు నరసయ్య, టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, తెలంగాణ గెజిటెడ్ నాన్ గెజిటెడ్ ఎంప్లాయిస్ కళావిజ్ఞాన వేదిక అధ్యక్షుడు వెంకట ముత్యం, ఐసిడిఎస్ జిల్లా అధ్యక్షులు ధనలక్ష్మి, ఏఎన్ఎముల అధ్యక్షురాలు ఉమారాణి,భద్రాచలం రాముల గుడి అర్చకులు రవికుమార్ శర్మ,టిపియుఎస్ జిల్లా అధ్యక్షుడు సురేష్, ఆర్ యు పీ పీ జిల్లా అధ్యక్షుడు రామ్ సింగ్ లు, ఏ టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు రాంబాబు,టిఎన్జీవో జిల్లా నాయకుడు శ్రీనివాసరావుతో పాటు టీఎస్ సి పీ యస్ భద్రాద్రి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఈ నెల 19 నుండి ఇందిరమ్మ కుటుంబ

జీవిత బీమా పథకం ప్రారంభం

కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట (జనంసాక్షి):

కుటుంబంలో ఆర్జించే వ్యక్తి చనిపోతే కుటుంబానికి అండగా ఉండాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.జిల్లాలోని అన్ని కుటుంబాలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు అర్హత ఉందని, ఈనెల 19 నుండి వచ్చే నెల 20 వరకు ఆన్ లైన్ ద్వారా ఇందిరమ్మ కుటుంబ జీవిత పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై సోమవారం మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునే వ్యక్తి కుటుంబాన్ని పోషించే వ్యక్తి అయి ఉండాలని, 18 నుండి 59 సంవత్సరాల లోపు వయసున్న వారు అర్హులని, కుటుంబంలో పోషించే వ్యక్తి మరణించినట్లయితే ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు, కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులకు గురి కాకుండా భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. వయసు దృవీకరణకు ఆధార్ కార్డు సమర్పించాల్సి ఉంటుందని, పేద ధనిక తేడా లేకుండా ప్రతి కుటుంబం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి భీమా పొందే వ్యక్తిగా ఉంటారని, కుటుంబంలోని వారు సభ్యులుగా ఉంటారని ఒకరి కంటే ఎక్కువ నామినీలు ఉండవచ్చని, అయితే కుటుంబ పెద్ద నామినీ పేర్లు సమర్పించాల్సి ఉంటుందని అన్నారు.కుటుంబ పెద్ద చనిపోతే 5 లక్షల రూపాయల జీవిత బీమా



అందుతుందని తెలిపారు.ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఎలాంటి చార్జీలు, ఫీజులు ,ప్రీమియం లు చెల్లించాల్సిన అవసరం లేదని,కేవలం దరఖాస్తు చేసుకుంటే సరిపోతుందని స్పష్టం చేశారు.రేషన్ కార్డు ,ఆధార్ కార్డు ఉన్న ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకోవచ్చని, రేషన్ కార్డు లేని వారు కూడా ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. అప్లికేషన్ తో పాటు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు జత చేయాలని, వీటన్నిటిని మొబైల్ యాప్ లేదా వెబ్ పోర్టల్ లో అప్లోడ్ చేయడం జరుగుతుందని, హార్డ్ కాపీలు ఎంపీడీవో కార్యాలయంలో భద్రంగా ఉంచాలని ఎంపిడిఓలను ఆదేశించారు.జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలలో ఒకేసారి ప్రారంభం కావాలని చెప్పారు.సూపర్వైజర్ అధికారులుగా ఎంపీడీవో, ఎంఈఓ, తహసిల్దార్, ఏఈపిఆర్, ఆర్డబ్ల్యూఎస్, ఎంపీవోలు ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, జడ్పి సిఈఓ శోరీష, సిపిఓ కిషన్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అధికారి వెంకట్ రెడ్డి, డిఎల్పివో తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యవంతమైన ప్రయాణమే లక్ష్యం

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు

సూర్యాపేటలో రద్దీ ప్రాంతాల్లో వాహనాల తనిఖీలను పరిశీలించిన జిల్లా ఎస్పీ నరసింహ

సూర్యాపేట(జనంసాక్షి):

ప్రజల రక్షణ, సురక్షిత ప్రయాణం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ లక్ష్యంగా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని అత్యంత రద్దీ ప్రాంతమైన ఖమ్మం అండర్పాస్ వద్ద నిర్వహిస్తున్న వాహనాల తనిఖీలను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల తనిఖీల నిర్వహణ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకుంటున్న చర్యలను పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.పట్టణంలోని ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాల్లో వాహనదారులు, పాదచారులు సులభంగా ప్రయాణించేలా ట్రాఫిక్ను క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్లపై అక్రమ ఆక్రమణలను తొలగిస్తూ ట్రాఫిక్కు ఆటంకం కలిగించే పరిస్థితులను నియంత్రిస్తున్నామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వాహనాల తనిఖీల సమయంలో ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.రోడ్లను ఆక్రమించిన వారికి ముందుగా అవగాహన కల్పించి, రహదారులపై ఉన్న ఆక్రమణలను తొలగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు.పట్టణంలోని దుకాణదారులు, వ్యాపార సంస్థల నిర్వాహకులు తమ వ్యాపార కార్యకలాపాల కోసం రోడ్లను ఆక్రమించవద్దని విజ్ఞప్తి చేశారు.రహదారులపై వాహనాలు నిలపడం, వస్తువులు ఏర్పాటు చేయడం ద్వారా ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలకు సహకరించాలని కోరారు.ప్రజల భద్రత, సౌకర్యవంతమైన ప్రయాణం, పట్టణంలో ట్రాఫిక్ సమస్యల నివారణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, ఈ దిశగా నిరంతరం చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, టౌన్ సీఐ వెంకటయ్య, ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి, ఎస్ఐలు గోపి కృష్ణ, కనకరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లో మొక్కలు బహుకరణ చేసిన యార్కల రాజు గౌడ్

నల్లగొండ,నవంబర్ 17,(జనంసాక్షి):

నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు కట్టంగూరు పోలీస్ స్టేషన్ ఎస్హె క్రాంతి ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ లో గార్డెన్ లో మొక్కల పెంపకం బాధ్యత గా జనం సాక్షి కట్టంగూరు రిపోర్టర్ యార్కల రాజు మొక్కలు బహుకరణ చేయడం జరిగింది.రాజు మాట్లాడుతూ మొక్కలు పెంచడం లో ప్రతి ఒక్కరు బాధ్యతగా నాటాలి అని పర్యావరణ పరిరక్షణ లో భాగంగా పని చేయాలని అన్నారు.అటు జర్నలిస్ట్ గా నే కాకుండా సమాజ సేవలో భాగం అయినందుకు రాజుని పలువురు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జమిందార్ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కైట్స్ అకాడమీ డైరెక్టర్ తిరుపతికి జాతీయ సేవా రత్న అవార్డు

○సినీ నటుడు హీరో సుమన్ తల్వార్ చేతుల మీదుగా పురస్కారం అందజేత

○తక్కువ ఫీజుతో నాణ్యమైన శిక్షణ.. అత్యధిక ఉద్యోగాల సాధనతో జాతీయ స్థాయిలో గుర్తింపు

○మారుమూల గ్రామం నుంచి జాతీయ స్థాయి గుర్తింపు వరకు.. తిరుపతి ప్రస్థానంపై పలువురి ప్రశంసలు!

తిరుమలాయపాలెం నవంబర్ 17 (జనంసాక్షి)

బిర్లా ఆడిటోరియంలో నిర్వహించిన ఘనమైన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో కైట్స్ అకాడమీ డైరెక్టర్ తిరుపతి రావు కు ప్రతిష్ఠాత్మకమైన జాతీయ సేవా రత్న అవార్డు లభించింది. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో విశేష కృషి చేస్తూ, అతి తక్కువ కాలంలోనే అత్యధిక ఉద్యోగాలు సాధించిన సంస్థగా కైట్స్ అకాడమీ గుర్తింపు పొందిన నేపథ్యంలో ఆయన సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేశారు. ప్రముఖ సినీ నటుడు, హీరో సుమన్ తల్వార్ చేతుల మీదుగా తిరుపతి రావు ఈ అవార్డును అందుకున్నారు. తిరుమలాయపాలెం మండలం పైనంపల్లి గ్రామపంచాయతీ శివారు వాంకుడోత్ తండా ఒక చిన్న మారుమూల గ్రామం నుంచి వచ్చిన తిరుపతి రావు, ఉన్నత లక్ష్యంతో కైట్స్ అకాడమిని స్థాపించి నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని అతి తక్కువ ఫీజుతో నాణ్యమైన శిక్షణ అందిస్తూ, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.కేవలం శిక్షణకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపుతూ, పోటీ పరీక్షలకు అవసరమైన నైపుణ్యాలను



పెంపొందించి అనేకమంది యువతీ యువకులు ఉద్యోగాలు సాధించేలా కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో కైట్స్ అకాడమీ జాతీయ స్థాయిలో అత్యధిక సక్సెస్ రేటు కలిగిన సంస్థగా గుర్తింపు పొందడం విశేషం.అతి తక్కువ సమయంలోనే విద్యారంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడంతో పాటు, చిన్న వయసులోనే రెండు అవార్డులు అందుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మారుమూల ప్రాంతం నుంచి ప్రారంభమైన ప్రస్థానం జాతీయ స్థాయి పురస్కారం వరకు చేరడం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని అభిప్రాయపడుతున్నారు. కష్ట పడితే సాధించలేనిది ఏదీ లేదని నిరూపిస్తూ, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిం చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న తిరుపతి రావుకు జాతీయ సేవా రత్న అవార్డు లభించడం కైట్స్ అకాడమికి, ఆయన అభిమానులకు గర్వ కారణంగా నిలిచింది. ఆయన మరిన్ని ఉన్నత శిఖ రాలను అధిరోహించాలని పలువురు అభినందనలు తెలియజేశారు.



రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ చల్లగుల్ల నాగేశ్వరరావుకు

పెన్షనర్ల ఘన సన్మానం

భద్రాచలం నవంబరు 17 (జనంసాక్షి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :– రెడ్‌క్రాస్ సంస్థ భద్రాచలం శాఖ వైస్‌చైర్మన్‌గా చల్లగుల్ల నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. మంగళవారం భద్రాచలంలోని సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు బంధు వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నాగేశ్వరరావుకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బంధు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు సేవలందిస్తున్న నాగేశ్వరరావుకు రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ బాధ్యతలు దక్కడం సంతోషకరమన్నారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ రెడ్‌క్రాస్ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు చంద్ర సుబ్బయ్యదరి, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎల్.వి. ప్రసాద్, కోశాధికారి డి. కృష్ణమూర్తి, మగడ హరినాథ్, ఎస్. రాజబాబు, టి. శివప్రసాద్, జి. మురళీకృష్ణ తదితర పెన్షనర్లు పాల్గొన్నారు.

భూదాన్ భూములపై స్పష్టత వచ్చాకే

తదుపరి చర్యలు

○ రికార్డుల పునఃపరిశీలన, రీసర్వే పూర్తయ్యాక నిర్ణయం

○ పోడు సాగుదారులకు ఐటీడీఏ పీవో బి.రాహుల్ స్పష్టీకరణ

భద్రాచలం నవంబర్ 17 (జనంసాక్షి)



భూదాన్ బోర్డు నుంచి పూర్తిస్థాయి స్పష్టత తీసుకున్న అనంతరం, భూములకు సంబంధించిన రికార్డులను పునఃపరిశీలించి, రీసర్వే ప్రక్రియను పూర్తి చేసిన తర్వాతే తదుపరి చర్యలు చేపడతామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ స్పష్టం చేశారు. భూముల హక్కులకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకున్నా అందుబాటులో ఉన్న ఆధారాలు, రికార్డులను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ముందుకు వెళ్తామని తెలిపారు. మంగళవారం ఐటీడీఏ పీవో తన ఛాంబర్‌లో అటవీ, రెవెన్యూ శాఖల అధికారులతో పాటు పోడు సాగుదారుల దరఖాస్తుదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భూములకు సంబంధించిన రికార్డులు, గతంలో సమర్పించిన ప్రతిపాదనలు, దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. దమ్మపేట మండలం నల్లివారిగూడెం గ్రామానికి చెందిన సుమారు 30 మంది పోడు సాగుదారుల కుటుంబాలు అటవీ హక్కుల గుర్తింపు చట్టం కింద వ్యక్తిగత అటవీ హక్కుల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు పీవో వివరించారు. అదేవిధంగా మరో 350 మంది భూదాన్ బోర్డు ద్వారా తమకు కేటాయించిన భూములపై హక్కులు కల్పించాలని కోరుతూ దరఖాస్తులు సమర్పించినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న రికార్డుల్లో భూములకు సంబంధించిన వివరాలు స్పష్టంగా లేకపోవడంతో సమస్య పరిష్కారానికి మరింత లోతైన పరిశీలన అవసరమని పేర్కొన్నారు. భూదాన్ బోర్డు నుంచి స్పష్టత తీసుకోవడంతో పాటు అటవీ, రెవెన్యూ శాఖల రికార్డులను సమన్వయం చేసి, రీసర్వే అనంతరం తదుపరి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఈ సమావేశంలో సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్) డేవిడ్ రాజ్, ఇన్‌చార్జి ఆర్ఓఎఫ్ఆర్ గన్యా నాయక్, ఫారెస్ట్ డివిజనల్ మేనేజర్ రెజ్వ భారతి, ఫారెస్ట్ జనరల్ మేనేజర్ డాక్టర్ జి.స్టైలాబ్, దమ్మపేట డిప్యూటీ తహసీల్దార్ బద్రు, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

○కొల్లుగూడెం వద్ద ఇసుక ర్యాంపును తక్షణమే ప్రారంభించాలి

○ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శేఖర్

భద్రాచలం నవంబర్ 17 (జనంసాక్షి)

భద్రాచలం పట్టణ పరిధిలోని కొల్లుగూడెం వద్ద అధికారిక ఇసుక ర్యాంపును తక్షణమే ప్రారంభించి స్థానిక ప్రజలకు అందుబాటు ధరల్లో ఇసుక సరఫరా చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శేఖర్ ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరారు. ఇసుక కొరత కారణంగా ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోవడంతో పాటు నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్న వందలాది మంది

ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువు

కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాచలం అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడేళ్లుగా ఇసుక కొరత సమస్య కొనసాగుతున్నప్పటికీ పరిష్కారం లభించడం లేదన్నారు. దీంతో సొంత ఇళ్లు నిర్మించుకోవాలనుకునే స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇసుక అందుబాటులో లేకపోవడంతో మేస్త్రీలు, కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు, ఇతర నిర్మాణ రంగ కార్మికులకు పనులు దొరకక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అధికారిక ఇసుక ర్యాంపు అందుబాటులోకి వస్తే స్థానికులకు అవసరమైన ఇసుక లభించడంతో పాటు వందలాది కుటుంబాలకు ఉపాధి దక్కుతుందన్నారు. మరోవైపు ప్రతిరోజూ సుమారు 30 ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక రవాణా జరుగుతోందని, దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోందని ఆరోపించారు. అధికారులు ఈ సమస్యపై తక్షణమే స్పందించి కొల్లుగూడెం వద్ద అధికారిక ఇసుక ర్యాంపును ఏర్పాటు చేయాలని, స్థానిక ప్రజలకు సరసమైన ధరలకు ఇసుక అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రమేష్, డేగల నవీన్‌కుమార్, పుట్టి అన్వేష్, మహర్షి, కిరణ్, రామకృష్ణ, కుమార్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులను వేగవంతం చేయాలి

రైతులు, సర్వే అధికారుల సమన్వయంతో భూ సర్వే పూర్తి చేయాలి:క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆర్డీఓ డి. మధు

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 17 (జనంసాక్షి)

మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో చేపడుతున్న భూ రీ సర్వే పనులను ఆర్డీఓ డి. మధు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నర్సాపురం గ్రామం రీ సర్వేకు ఎంపిక కావడంతో సర్వే పనుల పురోగతిని తహశీల్దార్ బి. స్వర్ణతో కలిసి పొలాల్లోకి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రీ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామ రైతులు, రెవెన్యూ సిబ్బంది, సర్వే అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సర్వే ప్రక్రియకు సహకరించాలని కోరారు. భూ సర్వేలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను అధికారులకు అందించాలని సూచించారు. అనంతరం రైతులు భీమిరెడ్డి



శ్రీనివాసరెడ్డి, గణపతిరెడ్డి మాట్లాడుతూ భూమిపై సాగు హక్కులు కలిగి ఉన్న రైతులకు న్యాయం జరిగేలా పట్టాలు మంజూరు చేయాలని ఆర్డీఓను కోరారు. ఈ కార్యక్రమంలో లైసెన్స్ సర్వేయర్ గణేష్, జీపీఓ బాలకృష్ణ, భీమిరెడ్డి కేశవరెడ్డి, ఎసుబాబు, శ్రీనివాసరెడ్డి, నర్సారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల చెరువు ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాల్సిందే!

- ఎల్‌నినో సాకుతో నీటిని నిరాకరిస్తే ఊరుకునేది లేదంటూ రైతుల ఆగ్రహం
- రసాభాసగా ముగిసిన అవగాహన సమావేశం.. ఈఈకి వినతిపత్రం అందజేసిన రైతులు



అశ్వాపురం,నవంబర్ 17 (జనంసాక్షి):
తుమ్మల చెరువు ఆయకట్టుకు రబీ సాగు కోసం సాగునీరు అందించాలని రైతులు డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావం పేరుతో సాగునీరు అందించ లేమని అధికారులు స్పష్టం చేయడంతో మొండి కుంట గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిం చిన అవగాహన సమావేశం వాడీవేడిగా సాగి రసాభాసగా ముగిసింది. నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఈ సమావేశంలో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రబీ సాగుకు తుమ్మల చెరువు ఆయకట్టుకు నీరు విడుదల చేసే అవకాశం లేదని తెలిపారు. దీంతో రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్టుకు జన్మస్థలమైన ప్రాంతంలోనే సాగునీటి కష్టాలు ఎదురుకావడం ఏమిటని ప్రశ్నించారు. తుమ్మల చెరువును పూర్తిస్థాయిలో నింపడంతో పాటు, మూడు ప్రధాన కాలువల్లో ఒక కాలువ పరిధిలోని ఆయకట్టుకైనా సాగునీరు అందించాలని కోరారు.ఇప్పటికే విత్తన ధాన్యం కొనుగోలు చేసి నారుమళ్లు సిద్ధం చేసుకున్నామని, ఈ సమయంలో సాగునీరు అందించలేమని చెప్పడం రైతులను ఇబ్బందులకు గురిచేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయకట్టు రైతులందరూ సమావేశమై ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నామని, రబీ వరి పంటకు సాగునీరు అందించాలని పట్టుబట్టారు. ఈఈకి వినతిపత్రం: సమావేశం అనంతరం రైతులు ఎస్‌ఆర్‌ఎల్పీ ఈఈ కార్యాలయానికి చేరుకుని ఈఈ తెల్లం వెంకటేశ్వర్లును కలిసి తుమ్మల చెరువును పూర్తిస్థాయిలో నింపి రబీ పంటలకు సాగునీరు అందించాలని వినతిపత్రం సమర్పించారు. రైతుల విజ్ఞప్తిపై ఈఈ సానుకూలంగా స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారులు, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.దీంతో రైతులు శాంతించినప్పటికీ, రబీ పంటలకు సాగునీరు అందుతుందా లేదా అన్న ఉత్కంఠ ఆయకట్టు రైతుల్లో నెలకొంది. ఈ కార్యక్రమంలో ఏడీఏ తాతారావు, ఏవో చటర్జీ, ఇరిగేషన్ డీఈ రమేష్ బాబు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, ఏఈఓలు, ఇరిగేషన్ ఏఈ రైతు సంఘాల ప్రతినిధులు మర్రి మల్లారెడ్డి, తోకల వీరయ్య, బద్దం శంభారెడ్డి, తుక్కాని రామిరెడ్డి, స్వర్గం రాఘవులు, బొక్కా రవీందర్, తెల్లం నాగేశ్వరరావు, వేల్పుల వెంకన్న, సతీష్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.



హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం : పగడాల సతీష్‌రెడ్డి

పినపాక, నవంబర్ 17(జనంసాక్షి):
ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ పినపాక మండల అధ్యక్షుడు పగడాల సతీష్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్డులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం చేపట్టి మూడేళ్లు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నేటికీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, నిరుద్యోగులకు అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు వాటిని విస్మరించిందని విమర్శించారు. హామీల అమలుపై స్పష్టత ఇవ్వకుండా ముఖ్యమంత్రి, మంత్రులు మాటలతో కాలయాపన చేస్తున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన నిలబడి హామీల అమలు జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాట్ల వాసుబాబు, గుమ్మడి గాంధీ, పోలిశెట్టి సత్తిబాబు, బత్తుల వెంకటరెడ్డి, బెడద సురేందర్, బుల్లిబాబు, ముక్కు నాసర్‌రెడ్డి, బూర సురేష్, చింతపంటి సత్యం, గుదిగొండ రామకృష్ణ, షేక్ జాంఘీర్, మునిగెల సంతోష్, కాళ్ల చంటి, శివ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి
చెరువులో పడి ఓ వ్యక్తి మృతి

పెనుబల్లి, నవంబర్ 17 (జనంసాక్షి)
ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెరువులో పడిపోవడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన పెనుబల్లి మండలంలో చోటు చేసుకుంది, గ్రామస్తుల వివరాల ప్రకారం కల్లూరు మండలం చండ్రుపట్ల గ్రామానికి చెందిన చప్పిడి నరసింహారావు దంపతులు చండ్రుగొండ మండలం ముద్దుకూరులో ఆదివారం దశ దిన ఖర్మకు హాజరైయ్యారు. తిరుగు ప్రయాణంలో పెనుబల్లి మండలంలోని లింగగూడెం లో నరసింహారావు అత్తగా రింటికి వెళ్లారు, భార్యను అక్కడ దించి తిరిగి వెళుతుండగా వాహనం అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న పెనుబల్లి రాథోని చెరువులో పడిపోయాడు, ఈ సంఘటనను గ్రామస్తులుగాని, పాదచారులుగాని, గమనించలేకపోయారు, దీంతో ప్రమాదవశాత్తు నరసింహారావు నీటిలో మునిగి చనిపోయాడు, నరసింహారావు ఒకరోజు గడిచిన ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువులు విచారణ చేపట్టడంతో ఆదివారం జరిగిన ఈ సంఘటన మంగళవారం ఉదయం వెలుగు చూసింది. బంధువుల ఫిర్యాదు మేరకు వి ఎం బంజర్ ఎస్ ఐ షకీర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.





ప్రజాగర్జన సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలను అమలు చేయాలి: సి.వై. పుల్లయ్య

ఖమ్మం రూరల్, నవంబర్ 17(జనంసాక్షి)
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 29న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రజాగర్జన ప్రదర్శన, బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సి.వై. పుల్లయ్య పిలుపునిచ్చారు. ఖమ్మం రూరల్ మండల పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం ఎం.వెంకటాయ పాలెంలోని గంగవరపు శ్రీనివాసరావు స్మారక భవనంలో గుడుచుట్ల మాధవరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ.. దేశంలోని కీలక వనరులు, సంపదను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కట్టబెడుతోందని విమర్శించారు. ప్రజా సంపద పరిరక్షణకు ప్రజలు ఉద్యమించాలని కోరారు.పార్టీ డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య మాట్లాడుతూ.. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ పేరుతో దళితులు, మైనార్టీలు, పేదల ఓట్లు తొలగించారంటూ ఆరోపించారు. ఈ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో జిల్లా నాయకులు మలీదు నాగేశ్వరావు, పార్టీ మండల కార్యదర్శి ఎడ్లపల్లి ఉపేందర్,కుర్ర వెంకన్న, రెంటాల యాదగిరి, వీర్ల వెంకట అప్పారావు, శీలం పూలమ్మ, బందెల లలిత, కందుల స్వామి, శీలం లెనిన్, కూసుమోహన్‌రెడ్డి, అవిరేణి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో
భద్రాచలం విద్యార్థిని ప్రతిభ

- ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టుకు ద్వితీయ స్థానం..
- యోక్షితకు అభినందనలు

భద్రాచలం నవంబర్ 17 (జనంసాక్షి)
రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో భద్రాచలం గర్ల్స్ హైస్కూల్ విద్యార్థిని మజ్జూరి యోక్షిత సత్తా చాటింది. అండర్-14 విభాగంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి, జట్టు ద్వితీయ స్థానం సాధించడంలో కీలక పాత్ర పోషించింది. సంగారెడ్డిలో నవంబర్ 13, 14, 15 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో యోక్షిత తన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి ప్రశంసలు అందుకుంది. ఇటీవల ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఎనిమిదో తరగతి చదువుతున్న యోక్షిత రాష్ట్రస్థాయిలో రాణించి పాఠశాలకు, జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థిని యోక్షితను పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామా, పీఈటీ సుజాత, ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో మరింత ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయి క్రీడాకారిణిగా ఎదగాలని ఆకాంక్షించారు.

నేడు అభ్యర్థుల ఉపసంహరణ

సాయంత్రం ఎన్నికల గుర్తుల కేటాయింపు

భద్రాచలం నవంబర్ 17 (జనంసాక్షి)
శ్రీ సీతారామ చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 18వ తేదీ బుధవారం అభ్యర్థుల ఉపసంహరణ, ఎన్నికల గుర్తుల కేటాయింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి తాండ్ర వెంకట రమణారావు తెలిపారు.బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోటీ నుంచి తప్పుకోవాలనుకునే అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు బరిలో మిగిలిన అభ్యర్థులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో అభ్యర్థులు తమ సలహాలు, సూచనలు తెలియజేయడంతో పాటు ఎన్నికలకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. సమావేశం అనంతరం అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు కేటాయించనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని ఎన్నికల అధికారి తాండ్ర వెంకట రమణారావు, సహాయకులు రవికుమార్, షేక్ సలీం కోరారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో భద్రాద్రి కవులకు ఘన సన్మానం

భద్రాచలం నవంబర్ 17 (జనంసాక్షి)
59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన కవి సమ్మేళనం సాహితీ సందడితో సాగింది. గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు కవులు తమ కవితలతో సాహితీ ప్రతిభను చాటుకున్నారు. కవి సమ్మేళనంలో మండల సుబ్బారావు, డాక్టర్ దిలావర్, తాతలు దుర్గాచారి, కేబీ శ్రీ, ఉమాదేవి, నాగవేణి చాగర్లమూడి, ఎస్. ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తిరుపతిరావు మాట్లాడుతూ సమాజంలో గ్రంథాలయాల ప్రాధాన్యత, పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు, సాహిత్యం అందించే విజ్ఞానం గురించి వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ పసుపులేటి వీరబాబు మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయం ఆధ్వర్యంలో వారోత్సవాలను ఘనంగా నిర్వహించడంతోపాటు స్థానిక కవులను ఆహ్వానించి కవి సమ్మేళనం ఏర్పాటు చేయడం, వారిని సముచితంగా సత్కరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో కార్యదర్శి కేకు అరుణకుమారి, సహాయ కార్యదర్శి మాతంగి లలితకుమారి చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. అనంతరం కవులు, అతిథులను గ్రంథాలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సాహిత్యాభిమానులు, పాఠకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని

మహ్మద్ షిరాజ్‌ద్దీన్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

- హజరత్ ఖాజా గరీబ్ నవాజ్ దర్గాలో 111 కిలోల జిలేబీ పంపిణీ చేసిన వీరాభిమాని
- రాజగోపాల్ రెడ్డి నాయకత్వంలోనే బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు న్యాయం:మహ్మద్ షిరాజ్‌ద్దీన్



చౌటుప్పల్ నవంబర్ 17 (జనంసాక్షి)
మునుగోడు శాసనసభ్యులు,కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాబోయే 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ,చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామ మైనార్టీ సెల్ అధ్యక్షులు వారి వీరాభిమాని మహ్మద్ షిరాజ్‌ద్దీన్ దేశంలోని అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రమైన అజ్మీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు (చాదర్ సమర్పణ,దువా) నిర్వహించారు.హజరత్ ఖాజా గరీబ్ నవాజ్ ఆశీస్సులతో రాజగోపాల్ రెడ్డి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటూ, దర్గా ఆవరణలో 111 కిలోల జిలేబీని భక్తులకు, పేదలకు పంపిణీ చేసి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మహ్మద్ షిరాజ్‌ద్దీన్ మాట్లాడుతూ.. "రాజగోపాల్ రెడ్డి నిస్వార్థంగా ప్రజల కోసం పనిచేసే నాయకుడు. ఆయన ముఖ్యమంత్రి అయితేనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో దూసుకెళ్తుంది. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలతో పాటు మైనార్టీలకు సంపూర్ణ న్యాయం, భద్రత లభిస్తాయని మేము ప్రగాఢంగా నమ్ముతున్నాము" అని ఆశాభావం వ్యక్తం చేశారు.తన జీవితాంతం, రాజకీయ ప్రయాణంలో ఎల్లప్పుడూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వెంటే అడుగులో అడుగు వేసి నడుస్తానని మహ్మద్ షిరాజ్‌ద్దీన్ ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.



ఎంసీపీఐయు రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశాలను జయప్రదం చేయాలి

సూర్యాపేట(జనంసాక్షి):
ఈ నెల 20, 21వ తేదీలలో జిల్లా కేంద్రంలో జరిగే ఎంసీపీఐయు రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వరికుప్పల వెంకన్న అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ నజీర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.తమ పార్టీ దేశంలోని 12 రాష్ట్రాలలో విస్తరించిందని తెలిపారు.ఎంసిపిఐయు పార్టీ ఏర్పడిన నాటి నుండి నేటి వరకు మాజీ ఎంపీ భీమిరెడ్డి నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ కలలుగన్న ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, కమ్యూనిస్టుల ఐక్యత కోసం, ప్రజా సమస్యలపై పనిచేస్తూ అన్ని కమ్యూనిస్టు పార్టీలను ఐక్యం చేయడానికి కృషి చేస్తుందని అన్నారు.జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు రెండు రోజులపాటు జరిగే ఈ సమావేశాలకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్, పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాథగోని రవితో పాటు 22 జిల్లాల నుండి పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు లింగంపల్లి పంచాయతీరాజ్,ఈరి వీరన్న, ఈదూరి వీర పాపయ్య, చందుపట్ల పవన్ కుమార్, వేముల పెద్ద నరసయ్య, నలుగురి రమేష్, నక్క శ్రీనివాస్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాలి

పించన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఉల్లంఘనపై నిరంజన్ గౌడ్ తీవ్ర ఆగ్రహం

స్థానిక ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం ఇవ్వాలని డిమాండ్

ప్రభుత్వ కార్యక్రమాన్ని పార్టీ కార్యక్రమంలా మార్చడం సరికాదని విమర్శ



చౌటుప్పల్ నవంబర్ 17 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పింఛన్ల పత్రాల పంపిణీ కార్యక్రమం లో ప్రోటోకాల్ పాటించ కుండా, స్థానిక ప్రజాప్రతినిధులను అవమానించారని యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచ్ ఫోరం జనరల్ సెక్రటరీ, దండు మల్కాపురం గ్రామ సర్పంచ్ గిర్కటి నిరంజన్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, నారాయణపురం,చౌటుప్పల్ మండలాలకు చెందిన సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లకు ప్రభుత్వ కార్యక్రమంలో తగిన గౌరవం, ప్రాధాన్యత ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. అధికారిక కార్యక్రమానికి ప్రజాప్రతి నిధులను గౌరవంగా ఆహ్వానించి వేదికపై సముచిత స్థానం కల్పించాల్సి ఉండగా, కేవలం అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమాన్ని ఒక పార్టీ సభలా నిర్వహించడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. గ్రామాల్లో ఎవరికి పింఛన్లు మంజూర య్యాయో ఆయా గ్రామ సర్పంచ్‌లకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా, కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేయించడం ప్రజాస్వామ్య విలువలకు, ప్రజాప్రతినిధుల గౌరవానికి విరుద్ధమని ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి, ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీలకు అతీతంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులందరికీ ప్రోటో కాల్ ప్రకారం గౌరవం కల్పించాలని నిరంజన్ గౌడ్ డిమాండ్ చేశారు.

కేజీబీవీ,పాఠశాలను సందర్శించిన ఎం.ఈ.ఓ మురళీమోహన్

ఎర్రుపాలెం నవంబర్ 17 (జనంసాక్షి) :
ఎర్రుపాలెం మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల పాఠశాలను ఎరుపాలెం విద్యాశాఖ అధికారి మురళీమోహన్ రావు మంగళవారం సందర్శించి తనిఖీ చేశారు.పాఠశాలలోని విద్యార్థుల భోజనాన్ని పరిశీలించారు.అలాగే మౌలిక సౌకర్యాలపై ఎస్.ఓ., సరితను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు ప్రభుత్వం నుండి బాలికలకు పంపిణీ చేసిన పరుపులు బెడ్ షీట్లు అందజేశారు.అలాగే పాఠశాలలో వంట సరుకులు తనిఖీ చేసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ., సరిత, ఉపాధ్యాయులు, రేణుక కృష్ణవేణి, సులోచన, రమాదేవి, అనిత, విజయ లక్ష్మి, జహీరా, సిబ్బంది, నాగమణి, జ్యోతి, ఉమా మహేశ్వరి, తదితరులు, పాల్గొన్నారు.



ఈ నెల 19న తుంగతుర్తి ఎక్సైజ్ కార్యాలయంలో

వాహనాలకు వేలంపాట



తుంగతుర్తి నవంబర్ 17 (జనంసాక్షి)
వివిధ ఎక్సైజ్ కేసులలో స్వాధీనం చేసుకున్న వాహనాలకు ఈ నెల 19న వేలం పాట నిర్వహించ నున్నట్లు ఎక్సైజ్ సీఐ జగన్మోహన్ రెడ్డి తెలిపారు, మంగళవారం మాట్లాడుతూ ఈ వేలం పాట తుంగతుర్తి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు, హీరో హోండా ప్యాషన్ ప్లస్, హీరో స్పెండర్ ప్లస్, టీవీఎస్ ఎక్సెల్, గ్లామర్, ప్యాషన్ ప్లస్,, హీరో గ్లామర్ బైక్, టీవీఎస్ మొత్తంగా19 వాహనాలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు పాటలో పాల్గొనే ఆసక్తిదారులు ప్రతి వాహనం యొక్క నిర్ణయించిన ధరలో సగం వాటా ఈఎండి చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు, వేలం పాటలో వాహనం లభించని వారి యొక్క డిపాజిట్ తిరిగి చెల్లించబడుతుందని తెలిపారు, వేలంపాటలో వాహనాన్ని దక్కించుకున్న వారు వారి డిపాజిట్ మొత్తాన్ని మినహాయించి మిగిలిన మొత్తాన్ని చెల్లించి వాహనాన్ని పొందవచ్చు అని తెలిపారు.

నేడు నూతన చేయూత పింఛన్ల ఉత్తర్వుల పంపిణీ

కార్యక్రమానికి హాజరుకానున్న దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్



పి.ఏ.పల్లి,నవంబర్ 17(జనంసాక్షి):
పి.ఏ.పల్లి మండలంలో నూతనంగా చేయూత పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు నేడు మంజూరు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి దేవరకొండ శాసనసభ్యులు హాజరుకానున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి చంద్రమౌళి సూచించారు. ఈ కార్యక్రమానికి పరిధిలోని 25 గ్రామ పంచాయతీల సర్పంచులు,గ్రామ పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ముఖ్యంగా నూతనంగా చేయూత పింఛన్లు మంజూరైన ప్రతి ఒక్క లబ్ధిదారుడిని కార్యక్రమానికి తీసుకురావాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ఉందని స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధి దారులకు పింఛన్ మంజూరు ఉత్తర్వులను అందజేసే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి, మంజూరైన ప్రతి ఒక్క లబ్ధిదారుడు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రమాదం

బస్సు చక్రాల కింద పడి వృద్ధ మహిళకు తీవ్ర గాయాలు



భద్రాచలం నవంబర్ 17 (జనంసాక్షి)
భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు రివర్స్ తీస్తున్న సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఓ వృద్ధ మహిళ బస్సు చక్రాల కింద పడటంతో తీవ్రంగా గాయపడింది. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడున్న స్థానికులు స్పందించి గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ ఉండే సమయంలో బస్సులు వెనక్కి తీసుకునేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. బస్సులను రివర్స్ చేసే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండటంతో పాటు, ప్రయాణికుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. బాధితురాలి వివరాలు, ఆరోగ్య పరిస్థితి, ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయండి

- నినదించిన ఉద్యోగ వర్గం
- హామీని నిలబెట్టుకోవాలి
- ధర్మదీక్షకు పెద్ద సంఖ్యలో హాజరు
- ఇబ్బందులను అధిగమించి
- మాట తప్పితే మూల్యం తప్పదు..

టీఎస్ సీపీఎస్ ఈయు ఖమ్మం జిల్లా అధ్యక్షులు చంద్రకంటి శశిధర్



ఖమ్మంఅర్బన్, (జనంసాక్షి) :

ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని ధర్మదీక్షలో ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఉద్యోగులకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తామని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ప్రకటించి నవంబర్ 17వ తారీకుతో మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఖమ్మం కలెక్టరేట్ ప్రాంగణంలోని ధర్నా చౌక్లో సిపిఎస్ ఉద్యోగులు ధర్మదీక్ష నిర్వహించారు. నవంబర్ 17వ తారీఖున కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ. . ఉద్యోగులు ఒక్కరోజు సామూహిక సెలవును పెట్టుకున్నారు. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాలోని టీఎస్ సీపీఎస్ ఈయు ఆధ్వర్యంలో జరిగిన ఈ సామూహిక సెలవు, ధర్మదీక్షకు వేలాదిగా ఉద్యోగులు తరలివచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని నినదించారు.

నిర్బంధాలను దాటుకొని..

ఖమ్మం జిల్లాలో టిఎస్ సి పి ఎస్ ఈయు పిలుపు కు విశేష స్పందన దక్కింది. వందలాదిగా ఉద్యోగులు ఆయా డిపార్ట్మెంట్లో 17వ తారీఖున విధులకు సెలవులు పెట్టారు, భారీ ఎత్తున ధర్మదీక్షకు తరలనున్నారని నిఘా వర్గాల సమాచారం మేరకు, ఉద్యోగులందరికీ సెలవులు రద్దు చేస్తున్నట్టు, విధిగా 17వ తేదీన డ్యూటీలకు హాజరు కావాలని ఆయా డిపార్ట్మెంట్ల నుండి ఉద్యోగులకు వాట్స్అప్ సందేశాలు అందాయి. అధికారులే నేరుగా ఉద్యోగులకు ఫోన్ చేసి విధులకు హాజరు కావాల్సిందిగా ఆదేశించారు. అయినా ఉద్యోగులు ఇవేవీ పట్టించుకోకుండా సెలవును కొనసాగించడమే కాక అత్యంత భారీ సంఖ్యలో ఖమ్మం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ధర్మదీక్షకు హాజరయ్యారు.

మాట తప్పితే మూల్యం తప్పదు..

తెలంగాణ రాష్ట్రంలో సిపిఎస్ ఉద్యోగులవి 2.8 లక్షల కుటుంబాలు ఉన్నాయని. కాంగ్రెస్ పార్టీ విజయంలో సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలు కీలక భూమిక ఉందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ప్రకటించడం వలనే కాంగ్రెస్ పార్టీకి విజయం దక్కిందని ఉద్యోగులు గుర్తు చేసుకున్నా.. ఇచ్చిన హామీకి మూడు సంవత్సరాలు దాటినా.. నేటికీ సిపిఎస్ పై ప్రభుత్వం నోరు మెదపకపోవడం విస్మయాన్ని కలిగిస్తుంది అని ఆవేదన చెందారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ భేషరతుగా ఎలాంటి ఆలస్యానికి తావు లేకుండా హర్యానా, రాజస్థాన్, జార్ఖండ్ రాష్ట్రాలలో పాత పెన్షన్ పునరుద్ధరించిన విధంగానే తెలంగాణలో కూడా నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఇది ముమ్మాటికి ఉద్యోగుల విజయం :చంద్రకంటి శశిధర్

టీ ఎస్ సి పి ఎస్ ఈ యు ఖమ్మం జిల్లా అధ్యక్షులు

కాంగ్రెస్ పార్టీ మూడు సంవత్సరాల క్రితం ఇచ్చిన హామీపై నోరు మెదపక పోవడాన్ని ఉద్యోగులు చాలా తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఇప్పటికైనా కాలయాపన లేకుండా వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టిఎస్ సిపిఎస్ ఈయు ఖమ్మం జిల్లా అధ్యక్షులు చంద్రకంటి శశిధర్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ అన్నారు. ఉద్యోగుల ఆకాంక్షలు ఉద్యమాల రూపంలో వ్యక్త పరచడం సర్వసాధారణమని., అలాంటి ఉద్యమాలను ఉక్కుపాదంతో అణచాలని చూస్తే మరింత తీవ్రమవుతుందే తప్ప ఉద్యమాలు సమసిపోవని ఆయన పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ పార్టీ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం అనే అంశాన్ని సానుకూల దృక్పథంతో ఉద్యోగుల శ్రేయస్సు దృష్ట్యా వెంటనే పరిశీలించి పరిష్కారం మార్గం దిశగా ముందుకు సాగాలని ఆయన డిమాండ్ చేశారు. ఖమ్మం ధర్నా చౌక్ లో జరిగిన ఈ కార్యక్రమాన్ని చూసైనా ప్రభుత్వం వెంటనే కార్యాచరణ ప్రకటించాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ఎట్టి పరిస్థితుల్లో పాత పెన్షన్ పునరుద్ధరించే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం సిపిఎస్ ఉద్యోగులతో కలిసి కలెక్టర్ గారికి మెమొరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ సీపీఎస్ ఈ యు ఖమ్మం జిల్లా అధ్యక్షులు చంద్రకంటి శశిధర్ తో పాటు రాష్ట్ర కార్యదర్శులు డా.హరికిషన్ సింగ్, రాగి సురేష్, జిల్లా కోశాధికారి గుగులోత్ మోహన్, ఉపాధ్యక్షుడు క్రాంతి కుమార్, మహిళా ఉపాధ్యక్షురాలు ఎమ్.శ్వేత, జాయింట్ సెక్రటరీ ఎస్ డి.ఎకె. జిలాని, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.సాయి కృష్ణ మద్దతిచ్చిన వారిలో తెలంగాణ పంచాయతీ రాజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ తిలక్,ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల జెఎల్స్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ వై.గామయ్య, బ్లైండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్,ఆర్ యు పి పి నుండి రవి చౌహాన్ మరియు సిపిఎస్ ఉద్యోగులు నరసింహా రావు, రాజశేఖర్,జానీమియా, వినోద్ చైతన్య, దేవేందర్,ఎస్.రమేష్, జాస్మిన్,కేశవ లక్ష్మి, భవాని, వనితా జ్యోతి, నాగమణి, స్వప్న, కృష్ణకుమారి, రాణి, గిరిజా కుమారి తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ వాసవి క్లబ్‌కు అవార్డుల పంట

ప్రతిభకు పట్టాభిషేకం.. సేవలకు పురస్కారాల వర్షం

ఒకటి కాదు.. ఏకంగా ఆరు ప్రతిష్ఠాత్మక అవార్డులు కైవసం



చంద్రుగొండ, నవంబర్ 17 (జనం సాక్షి):

సేవా కార్యక్రమాల్లో ముందుంటూ, సమాజానికి తన వంతు సేవలందిస్తున్న చంద్రుగొండ వాసవి క్లబ్‌కు అరుదైన గౌరవం దక్కింది. చారుగుల్ల వారి డిస్కన్?2026 వేదికల్లో చంద్రుగొండ వాసవి క్లబ్ ఏకంగా ఆరు ప్రతిష్ఠాత్మక అవార్డులను కైవసం చేసుకొని సత్తా చాటింది.క్లబ్ పనితీరు, సేవా కార్యక్రమాలు, నిర్వహణా ప్రతిభకు గుర్తింపుగా బెస్ట్ వాసవి క్లబ్, సూపర్ బెస్ట్ ప్రెసిడెంట్, బెస్ట్ బ్యానర్ ప్రెజెంటేషన్, బెస్ట్ సేవారత్న, గవర్నర్ అప్రిసియేషన్ అవార్డు, బెస్ట్ ఫోటో ఆల్బమ్, చారుగుల్ల అవార్డు వంటి పురస్కారాలు లభించాయి.ఒకేసారి ఇన్ని అవార్డులు అందుకోవడం పట్ల క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయంతో చంద్రుగొండ వాసవి క్లబ్ ఖ్యాతి మరింత పెరిగిందని పేర్కొన్నారు. క్లబ్ అధ్యక్షుడి నాయకత్వం, సభ్యుల సమిష్టి కృషి, సేవాభావం ఈ విజయానికి ప్రధాన కారణమని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా పలువురు వాసవి క్లబ్ ప్రతినిధులు, సభ్యులు విజేతలను అభినందిస్తూ శు భాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజ అభ్యున్నతికి కృషి చేస్తామని క్లబ్ సభ్యులు తెలిపారు.

క్షయ వ్యాధి నిర్ధారణ ఎక్స్‌రే క్యాంపు



మధిర, నవంబర్ 17 (జనంసాక్షి): టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఖమ్మంపాడు సెంటర్, చిలుకూరు గ్రామంలో క్షయ వ్యాధి నిర్ధారణ కోసం ఎక్స్‌రే క్యాంపును నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా క్షయ వ్యాధి లక్షణాలైన రెండు వారాలకు మించి దగ్గు, ఆకలి మందగించడం, శరీర బరువు తగ్గడం, సాయంత్రం వేళల్లో జ్వరం రావడం వంటి లక్షణాలు ఉన్న అనుమానితులను గుర్తించి వారికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.క్షయ వ్యాధిని ముందస్తుగా గుర్తించి, సరైన సమయంలో చికిత్స అందించడం ద్వారా దేశంలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని వైద్య సిబ్బంది తెలిపారు. ప్రజలందరూ ఈ ఉచిత వ్యాధి నిర్ధారణ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ద్వారా ఉచితంగా మందులు అందించడంతో పాటు, చికిత్సా కాలంలో పోషకాహారం కోసం ప్రతినెలా రూ.1,000 ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు వివరించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుక్కమల్ల సుధీర్ కుమార్, ఉపసర్పంచ్ నిడమనూరి వంశీకృష్ణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పృథ్వీరాజ్ నాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సీనియర్ చికిత్స పర్యవేక్షకులు ఎన్. సందీప్, సీనియర్ చికిత్స ల్యాబ్ పర్యవేక్షకులు కె. శివ, జిల్లా ఎక్స్రే కోఆర్డినేటర్ అలీషా,సూపర్వైజర్ లంక కొండయ్య, ఏఎన్ఎంలు భారతి, నాగమణి, హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, ఆశ కార్యకర్త నాగూర్ బీ, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిదానపురం పూర్వ విద్యార్థుల ఉదారతకు అభినందనల వెల్లువ

ప్రాథమిక పాఠశాలకు రూ.60 వేల ఆర్థిక సహాయం



మధిర, నవంబర్ 17 (జనంసాక్షి):

చదువుకున్న పాఠశాలను మరువక, చదువుకుంటున్న చిన్నారుల కష్టాలను తీర్చేందుకు ముందుకొచ్చిన పూర్వ విద్యార్థులు ఆదర్శంగా నిలిచారు.మధిర మండలం నిదానపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 2022లో మన ఊరు ? మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రారంభించిన తాగునీటి ట్యాంక్, మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో పాఠశాల విద్యార్థులు తాగునీరు, ఇతర కనీస సౌకర్యాల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల సమస్యలను గమనించిన గ్రామ పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలపై ఉన్న మమకారంతో ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూడకుండా, తమ వంతు బాధ్యతగా స్వచ్ఛందంగా ముందుకొచ్చి రూ.60,000 ఆర్థిక సహాయంతో పాఠశాలలో వాటర్ ట్యాంక్, పైపులైన్, మోటార్‌ను ఏర్పాటు చేయించారు. తద్వారా విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులను తొలగించి, పాఠశాలలో మెరుగైన వసతుల కల్పనకు బాటలు వేశారు.తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి, నేటి విద్యార్థుల సంతోషానికి పూర్వ విద్యార్థులు అందించిన సహకారం అభినందనీయం. చదువు నేర్పిన బడిపై కృతజ్ఞతను మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తూ, సమాజానికి సేవా స్ఫూర్తిని చాటిన పూర్వ విద్యార్థుల సంఘం ఆదర్శప్రాయంగా నిలిచింది. పాఠశాల అనుబంధం ఎన్నటికీ చెరిగిపోదని, బడికి చేసిన సేవ తరతరాలకు గుర్తుండిపోతుందని వారు నిరూపించారు.ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీధర్, గ్రామ సర్పంచ్ వెంపటి రత్నకుమారి, గ్రామపెద్దలు పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు శివ రామకృష్ణ, కృష్ణారెడ్డి, కవితతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పూర్వ విద్యార్థుల సంఘానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.తాము చదువుకున్న బడికి తిరిగి చేయూతనివ్వడం కంటే గొప్ప గురుదక్షిణ మరొకటి లేదు. చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు పూయించేందుకు ముందు కొచ్చిన నిదానపురం పూర్వ విద్యార్థుల సేవాభావం మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని ఆశిద్దాం.

టీఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ లో మధిరకు సముచిత ప్రాధాన్యత

మధిర, నవంబర్ 17 (జనంసాక్షి):
ముదిగొండ కేంద్రంగా ఈనెల 15,16 తేదీలలో రెండు రోజులపాటు ఉత్సాహపూరిత వాతావరణం లో జరిగిన టీఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా మహాసభలలో మధిర మండలానికి సముచిత ప్రాధాన్యత లభించింది.ఖమ్మం జిల్లా కార్యదర్శిగా మూడోసారి షేక్ నాగూర్ వలి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యునిగా మహ్మద్ రఫీ ఏకగ్రీవంగా× ఎన్నికయ్యారు.రెండు రోజుల పాటు జరిగిన ఈ మహాసభలు సంఘ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చావా రవి, ఆదిమూలం వెంకట్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీమతి చావ దుర్గా భవాని ల పర్యవేక్షణలో విజయవంతంగా జరిగాయి. ఈ మహాసభలు ఉపాధ్యాయుల భారీ ర్యాలీ ఉపాధ్యాయ ఉద్యమ వీరులకు అరుణాంజలి ఘటించటంతో ప్రారంభమయ్యాయి. ఉద్యమ పతాకాల ఆవిష్కరణ, సంఘ రాష్ట్ర నాయకుల సందేశాలు, వక్తలతో సెమినార్లు, సంఘ కార్యకలాపాలపై, జిల్లా శాఖ పనితీరుపై నివేదిక, చర్చ ఆమోదం, నూతన కమిటీ నిర్మాణం ప్రధాన ఎజెండాగా జరిగాయి.ఈ సందర్భంగా షేక్ నాగూర్ వలి, మహ్మద్ రఫిలు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా శాఖ ఇచ్చిన బాధ్యతలు సమర్థవంతంగా నెరవేరుస్తామని ఎల్లవేళలా ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి విద్యారంగ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. రాబోయే కాలంలో పిఆర్ సి సాధన , సిపిఎస్ రద్దు, పెండింగ్ డి ఎలు- బిల్లులు విడుదల, జిఓ25 సవరణ, పదోన్నతులు బదిలీలు, ఎం జి పివిద్యాలయాల టైమింగ్స్ మార్పు, తదితర డిమాండ్ ల సాధనలో రాష్ట్ర కమిటీ ఇచ్చే పిలుపు లన్నింటినీ విజయవంతం చేస్తామని తెలిపారు.జిల్లా కార్యదర్శిగా షేక్ నాగూర్ వలి, ఆడిట్ కమిటీ సభ్యునిగా మహమ్మద్ రఫీ ల ఎన్నిక పట్ల మధిర ప్రాంతీయ కార్యాలయం కన్వీనర్ ఏ వినోద రావు, మండల అధ్యక్ష కార్యదర్శు లు బి నాగరాజు, ఈ



వీరయ్య, ఉపాధ్యక్షులు కాజా సునీత, పి బాజిఖాన్, కోశాధికారి, బి చెన్నయ్య, రాణి, డి కవిత, చెడే రాణి, ఊట్ల కొండలరావు, షేక్ లాల్ అహ్మద్, జి.విజయలక్ష్మి, లంకా నాగేశ్వరరావు, డి.మహేంద్ర కుమార్, బి రమేష్ బాబు, గోపీచంద్ పలువురు నాయకులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతిని కాపాడుకుందాం..
భవిష్యత్తును రక్షించుకుందాం

శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ బి. అంజనబాబు

మధిర, నవంబర్ 17 (జనంసాక్షి):





మధిర మండల పరిధిలోని అత్కూర్ గ్రామంలో గల శ్రీనిధి పాఠశాలలో మంగళవారం పాఠశాల కరస్పాండెంట్,ప్రిన్సిపాల్ బి.అంజనబాబు ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావాల వల్ల కలిగే వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల, లోటు వర్షపాతం మరియు పర్యావరణంపై వాటి ప్రభావాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రకృతి పరిరక్షణ,పర్యావరణ పరిరక్షణ, నీటి పొదుపు, ఇంధన పొదుపుల ను పాటిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రకృతిని కాపాడుకుందాం. భవిష్యత్తును రక్షించుకుందాం అనే విధంగా విద్యార్థులకు ముఖ్య సూచనలు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చందు, ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు,అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేపై రైతులకు అవగాహన సదస్సు

ఎర్రుపాలెం, నవంబర్ 17 (జనంసాక్షి):

ఎర్రుపాలెం మండలంలో రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న భూ రీ సర్వే పై ఎర్రుపాలెం రైతు వేదిక లో రైతుల అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తాసిల్దార్ సునీత ఎలిజిబెత్ తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే భూమి రీ సర్వే పలు గ్రామాల రెవెన్యూ పరిధిలో నిర్వహించామన్నారు.ఈ భూ సర్వేలో భాగంగా బుధవారం ఎర్రుపాలెం,పరిధిలోని కేశిరెడ్డిపల్లి రెవెన్యూలో భూ రీ సర్వే నిర్వహిస్తున్నట్లు, తాసిల్దార్ సునీత ఎలిజిబెత్, తెలిపారు. అలాగే ఎరుపాలెం రైతు వేదికలో భూ రీ సర్వేపై నిర్వహించనున్న రైతుల అవగాహన సదస్సులో రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్.ఐ, రవికుమార్, ఎర్రుపాలెం,జిపిఓ,బాలయ్య,సర్వే,రాజశేఖర్,రెవెన్యూసిబ్బంది, పాల్గొన్నారు.





సైన్స్ ఒలింపియాడ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎంఈఓ శైలజ లక్ష్మి

ఖమ్మం కార్పొరేషన్ నవంబర్ 17 (జనంసాక్షి)

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం, సృజనాత్మకతతో పాటు నైతిక విలువలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ నెల 29వ తేదీ ఆదివారం నిర్వహించనున్న చిల్డ్రన్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (సీఐఓ) సైన్స్ ఒలింపియాడ్ పరీక్ష పోస్టర్‌ను మండల విద్యాశాఖాధికారి శైలజ లక్ష్మి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐఓ పట్టణ ఇన్‌చార్జి నస్రిన్ సుల్తానా, కో-ఇన్‌చార్జి నూరీ అఫ్షా పాల్గొన్నారు.ఈ సందర్భం గా ఎంఈఓ శైలజ లక్ష్మి మాట్లాడుతూ.. సైన్స్ విద్యను నైతిక విలువ లతో అనుసంధానిస్తూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించే ఈ కార్యక్రమం అభి నందనీయమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్ ఒలింపియాడ్ దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం నస్రిన్ సుల్తానా మాట్లాడుతూ.. పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విద్యార్థులు భావనలను అర్థం చేసుకుని, నేర్చుకున్న జ్ఞానాన్ని అన్వ యించుకుంటూ విశ్లేషణాత్మకంగా ఆలోచించేలా సైన్స్ ఒలింపియాడ్ ప్రోత్సహిస్తుందని తెలిపారు. శాస్త్రీయ విజ్ఞానంతో పాటు నైతిక విలువలు కలిగిన ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడమే సీఐఓ ప్రధాన లక్ష్యమని వివరించారు.పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6, 7, 8వ తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ సైన్స్ ఒలింపియాడ్ లోపాల్గొనిఅవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలనినూరీఅఫ్షా కోరారు.

సర్వజ్ఞ స్కూల్ విజయదుందుభి

టేబుల్ టెన్నిస్ పోటీల్లో గోల్డ్ మెడల్స్ కైవసం

ఖమ్మం, (జనంసాక్షి) :



చంద్రకళ మెమోరియల్ ఓపెన్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్షిప్ 2026- రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సర్వజ్ఞ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. వేర్వేరు విభాగాల్లో పోటీపడిన విద్యార్థులు బహుముఖ ప్రతిభను చాటుతూ బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు.
విజేతల వివరాలు: అండర్-14 విభాగం: హరి , అండర్-14 విభాగం: చార్విక్ , అండర్-17 విభాగం: పజల్ , అండర్-17 విభాగం: తరుణ్
ఈ ఘన విజయంపై పాఠశాల ఛైర్మన్ శ్రీ ఆర్.వి. నాగేంద్ర కుమార్ గారు మాట్లాడుతూ, "చదువుతో పాటు క్రీడల్లోనూ సర్వజ్ఞ విద్యార్థులు ఎప్పుడూ ముందంజలో ఉంటారు. క్రమశిక్షణ, నిరంతర సాధనతోనే ఈ విజయం సాధ్యమైంది. భవిష్యత్తులో ఈ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించి స్కూల్‌కు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను," అని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ కె. నీలిమ మాట్లాడుతూ, "మా పాఠశాల విద్యార్థులు టేబుల్ టెన్నిస్ విభాగంలో మొదటి స్థానం సాధించడం చాలా గర్వకారణంగా ఉంది. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి, వారిని క్రీడల వైపు ప్రోత్సహించడంలో మా వ్యాయామ ఉపాధ్యాయుల కృషి అభినందనీయం. విజయం సాధించిన విద్యార్థులందరికీ నా హృదయపూర్వక అభినందనలు," అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బంగారం పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు ఘనంగా అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

వ్యవసాయ సాగునీటి, పశుసంవర్ధక శాఖల ప్రగతిపై ప్రత్యేక సమీక్షా సమావేశం

కామేపల్లి, నవంబర్17(జనంసాక్షి):

కామేపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఉన్నత స్థాయి ప్రత్యేక సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధి పనుల ప్రగతిపై సమగ్రంగా సమీక్షించారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్డీఓ) ఆదేశాల మేరకు అత్యవసర ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఏపీడీ చలపతిరావు తెలిపారు. వీబీ-జీ రామ్ జీ కన్వర్జెన్సీ పథకంలో భాగంగా చేపడుతున్న పలు పనులపై ఈ సందర్భంగా కూలంకషంగా చర్చించారు. ప్రధానంగా చెరువుల మరమ్మతులు చేపట్టడం, పూడికతీత పనులు, కలుపు మొక్కల తొలగింపు (జంగిల్ క్లియరెన్స్), అలాగే సాగునీటి సరఫరా కోసం ఫీల్డ్ అలాగే ఫీడర్ కాలువల పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషణను ప్రోత్సహించే దిశగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల నీటి తొట్టెల(క్యాటిల్ ట్రఫ్స్) నిర్మాణ పనులను పరిశీలించారు. మరోవైపు వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు మేలు చేకూర్చే పశుగ్రాస పెంపకం అజోలా తయారీ పద్ధతులపై కూడా విస్తృతంగా చర్చించి,నిర్దేశిత లక్ష్యాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ టోర్నమెంట్‌లో పిండిప్రోలు కళాశాల విద్యార్థులకు కాంస్యం

ఖమ్మం బాలికల జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ముగ్గురు ప్రథమ సంవత్సరం విద్యార్థినులు

తిరుమలాయపాలెం నవంబర్ 17 (జనంసాక్షి)



70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్?19 రాష్ట్రస్థాయి నెట్‌బాల్ టోర్నమెంట్‌లో పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం కామర్స్ విద్యార్థులైన ఏ. మహేశ్వరి, టి. సింధు ప్రియా, బి. నందిని కాంస్య పతకాలు సాధించారు. ఖమ్మం జిల్లా బాలికల జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వీరు జట్టు తృతీయ స్థానం సాధించడంలో భాగస్వాములయ్యారు.నవంబర్ 14 నుంచి 16 వరకు నారాయణపేటలోని కొండాపూర్ బాలుర తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఈ పోటీలు జరిగాయి. టోర్నమెంట్‌లో ఖమ్మం జిల్లా బాలికల, బాలుర జట్లు రెండూ తృతీయ స్థానం సాధించి కాంస్య పతకాలు గెలుచుకున్నాయి.పతక విజేతలను మంగళవారం కళాశాలలో ప్రిన్సిపల్ రామకృష్ణ, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ దొండేటి రామయ్య, పిండిప్రోలు గ్రామ సర్పంచ్ సువార్త, ఉప సర్పంచ్ చామకూరి రాజు శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.నిరంతర సాధనతో రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపల్ రామకృష్ణ, సర్పంచ్ సువార్త అభినందించారు. ఆసక్తి ఉన్న రంగంలో పట్టుదలతో సాధన చేస్తే ఎంతటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని ఈ ముగ్గురు విద్యార్థినులు నిరూపించారని అన్నారు.వెంకటగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ రమణ ప్రోత్సాహంతో తాము ఈ స్థాయికి చేరుకున్నామని విద్యార్థినులు తెలిపారు. తమ గురువు రమణకు, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సహకరించిన కళాశాల అధ్యాపకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పినపాక నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

- 1,497 మందికి చేయూత పింఛన్లు..
- సారపాకలో 30 పడకల ఆసుపత్రికి సీపీఎం వినతి
- రూ.60 లక్షలతో వెంకట్రావుపేటలో అభివృద్ధి పనులు..
- ఈ నెల 19 నుంచి ఇందిరమ్మ జీవిత బీమా భరోసా







బూర్గంపహాడ్/ అశ్వాపురం/ పినపాక, నవంబర్ 17 (జనంసాక్షి):

పినపాక నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలుతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే, శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. బూర్గంపహాడ్, అశ్వాపురం మండలాల్లో మొత్తం 1,497 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్లు మంజూరు కాగా, పినపాక మండలంలోని వెంకట్రావుపేటలో రూ.60 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మరోవైపు సారపాకలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

1,497 మందికి చేయూత పింఛన్లు

బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో 846 మంది వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత, బీడీ కార్మికులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పింఛన్లు పంపిణీ చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అదేవిధంగా అశ్వాపురం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 651 మంది లబ్ధిదారులకు నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన మాట్లాడుతూ పింఛన్లు పొందని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 19 నుంచి ఇందిరమ్మ జీవిత బీమా భరోసా కార్యక్రమం ప్రారంభమవుతుందని, కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబానికి రూ.5 లక్షల బీమా పరిహారం అందించనున్నట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు, బీమా పథకాలకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు, చేయూత పింఛన్లతో ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడతలో 4,500 ఇళ్లు మంజూరు చేశామని, తదుపరి విడతల్లోనూ అర్హులకు ఇళ్లు అందిస్తామని తెలిపారు. రేషన్ కార్డులు లేనివారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు వైద్య సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అశ్వాపురం మండలంలో మారేళ్లపాడు లెఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేసి తుమ్మలచెరువును నింపడంతో పాటు రైట్ కెనాల్ పనులను త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించడం లక్ష్యమన్నారు. మండలంలో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణంతో పాటు పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. పింఛన్లు రాని అర్హులు అధికారులను సంప్రదించాలని, దళారులను నమ్మవద్దని సూచించారు.


సారపాకలో 30 పడకల ఆసుపత్రి నిర్మించాలి

సారపాక, పరిసర గ్రామాల ప్రజల వైద్య అవసరాల దృష్ట్యా 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. సారపాక, తాళ్లగొమ్ముూరు, కొయ్యగూడెం తదితర గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల్లో సుమారు 50 వేల మంది నివసిస్తున్నారని, ఐటీసీ పరిశ్రమలో ఆరు వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ సరైన ప్రభుత్వ వైద్య సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రమాదాలు, సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు, క్యాన్సర్ వంటి సమస్యలకు చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రజల ఆరోగ్య భద్రత కోసం 30 పడకల ఆసుపత్రితో పాటు అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అబీదా తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రావుపేట అభివృద్ధికి రూ.60 లక్షలు

పినపాక మండలం వెంకట్రావుపేట గ్రామంలో రూ.60 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, నూతన గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించనున్నారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన హ్యాండ్‌బోర్‌ను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బూర్గంపాడు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తోలెం కళ్యాణి, జిల్లా కాంగ్రెస్ నాయకులు గొడిశాల రామనాధం, జి. శ్రీనివాసరెడ్డి, రమేష్, కొర్సా ఆనంద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పేరం వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, వి. లక్ష్మిరెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి : జిల్లా అధ్యక్షుడు లావుడ్యా రవికుమార్ చౌహాన్ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్



కామేపల్లి, నవంబర్ 17 (జనంసాక్షి):-
సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఖమ్మం జిల్లా రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్తు జిల్లా అధ్యక్షులు లావుడ్యా రవికుమార్ చౌహాన్ డిమాండ్ చేశారు.జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ధర్మ దీక్ష కు ఆయన సంపూర్ణ మద్దతు తెలిపారు.సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులకు సంపూర్ణ మద్దతు ను తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానం అమలు అవుతా ఉంటే మన రాష్ట్రంలో ఎందుకు కావటం లేదని ప్రశ్నించారు. సిపిఎస్ వల్ల ఉద్యోగ ఉపాధ్యాయులు చాలామంది తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయులు 80 శాతం మంది సిపిఎస్ ఉద్యోగులు ఉన్నారని వారు ఇప్పటికీ తమ కోసం తమ కుటుంబం కోసం కృషి చేయకపోతే నష్టపోతారని తెలిపారు.ఉద్యోగ ఉపాధ్యాయుల డబ్బులను ఎల్ఐసి, యస్బిఐ ,ఇతర సంస్థలలో షేర్ మార్కెట్లో జమ చేయవలసిన అవసరం ఏముందని ప్రశ్నించారు. మన ఖమ్మం జిల్లాలో మన అదృష్టంగా ముగ్గురు మంత్రులు ఉన్నారని వారి ద్వారా తమ సమస్యలు పరిష్కారం చేసుకోవాలని కోరారు.సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు తమ సమస్యలపై ఉప్పెనల ధర్నాలు దీక్షలు చేయకపోతే ఏమి సాధించలేరని తమ ఆత్మ గౌరవాన్ని సాధించుకున్న భాషా పండితుల సమస్య తమ రాష్ట్ర అధ్యక్షులు శానమోని నర సింహులు ఆధ్వర్యంలో సాధించుకున్నామని గుర్తు చేశారు.అలాగే సిపిఎస్ ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యలపై ఎప్పటికీ తమ వెంటనే ఉండి తమ సమస్యల పట్ల పోరాటం చేయడానికి రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్తు ఖమ్మం జిల్లా శాఖ ఎప్పటికీ తోడు ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి లాకావత్ బంగారు సభ్యులు మాణిక్ చంద్ , సుధాకర్,శ్రీను, రవి, శ్రీనివాస్, ప్రమీల, సుజాత, లక్ష్మి, రాఘవరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల త్యాగానికి పాదాభివందనం..
విద్యార్థుల ప్రతిభకు త్రివేణి పట్టాభిషేకం



ఖమ్మం, (జనంసాక్షి) :
పదో తరగతి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పట్టుదల, ఏకాగ్రత, లక్ష్యసాధన పట్ల నిబద్ధతను పెంపొందించాలనే ఉద్దేశంతో త్రివేణి పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక మోటివేషనల్ సెషన్‌ను మంగళవారం ఖమ్మంలోని సూర్య తేజ ఏసీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. 2026?27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఖమ్మం, సత్తుపల్లి శాఖల పదో తరగతి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ సైకాలజిస్ట్, బిహేవియరల్ స్కిల్స్ ట్రైనర్ డా. సంద్ర సుధీర్ విద్యార్థులకు ప్రత్యేక ప్రేరణాత్మక సెషన్ నిర్వహించి, పరీక్షల పట్ల భయాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, సమయపాలన, ఏకాగ్రత, నిరంతర సాధనతో విజయాన్ని సాధించవచ్చని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా త్రివేణి స్కూల్స్ సీఏసీ డా. ఎల్. నటరాజ్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించగా, త్రివేణి?కృష్ణవేణి ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ శ్రీ వై. వెంకటేశ్వరరావు విద్యార్థులకు విలువైన సందేశాన్ని అందించారు. అనంతరం డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ ”త్రివేణి విద్యార్థులు ర్యాంకర్లే కాదు గుణాల బ్యాంకర్లు” అని పేర్కొంటూ, విద్యార్థులు కేవలం మార్కుల సాధనకే పరిమితం కాకుండా క్రమశిక్షణ, పట్టుదల, సానుకూల దృక్పథం, నిరంతర కృషిని అలవర్చుకోవాలని, పదో తరగతి విజయమే ఉన్నత భవిష్యత్తుకు పునాది కావాలని సూచించారు. అనంతరం ఖమ్మం, సత్తుపల్లి శాఖలకు చెందిన పదో తరగతి 580 నుండి 595 మార్కులు సాధించిన 24 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఘనంగా సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాల వద్ద పూలు సమర్పించి, వారి ప్రేమకు, త్యాగానికి కృతజ్ఞతలు తెలియజేయడం కార్యక్రమంలో ప్రత్యేక భావోద్వేగ ఘట్టంగా నిలిచింది. త్రివేణి యాజమాన్యం విద్యార్థులకు మెమెంటోలు అందించి, వారి తల్లిదండ్రులను పూలు, శాలువాలతో ఘనంగా సత్కరించింది. విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రుల పాత్రను గుర్తిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. మధ్యాహ్న భోజన విరామం అనంతరం రెండో విడత మోటివేషనల్ సెషన్ నిర్వహించారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకొని కార్యక్రమంపై సానుకూల స్పందన తెలియజేశారు. చివరగా ముఖ్య అతిథిని త్రివేణి డైరెక్టర్లు, కోర్ టీమ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి. రాజేంద్ర ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న,ముస్తఫా, త్రివేణి పాఠశాలల డైరెక్టర్లు, కోర్ టీమ్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట విద్యార్థుల ధర్నా

◆ప్రిన్సిపాల్‌ను మార్చాలంటూ విద్యార్థుల ఆందోళన ◆క్లాసులు బహిష్కరించి ధర్నా.. సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం



కల్లూరు, నవంబర్ 17 (జనం సాక్షి):
ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వేముల శేఖర్ విద్యార్థినుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నారంటూ విద్యార్థులు మంగళవారం తరగతులు బహిష్కరించి కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రిన్సిపాల్‌ను మార్చాలని, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.అనంతరం పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి వినతిపత్రం అందజేశారు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఐఈఓ రవిబాబు కళాశాలకు చేరుకుని విద్యార్థినులు, అధ్యాపకులతో విచారణ చేపట్టారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం నివేదిక అందజేస్తామని అధికారులు తెలిపారు.తనపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, కళాశాలలో క్రమశిక్షణ, సమయపాలన అమలు చేసేందుకు చర్యలు తీసుకోవడమే కొందరికి నచ్చడం లేదని ప్రిన్సిపాల్ వేముల శేఖర్ వివరణ ఇచ్చారు. మరోవైపు రాజకీయాలకు విద్యార్థులను బలిచేయకుండా, విచారణలో బాధ్యులెవరో తేల్చి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు మేధావులు కోరారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పిలుపు



భద్రాచలం నవంబర్ 17 (జనంసాక్షి)
ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా భాగస్వాములు కావాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పిలుపునిచ్చారు. భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు.
మంగళవారం భద్రాచలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో ‘వృక్షో రక్షతి రక్షితః’ నినాదంతో ప్లాస్టిక్ నివారణ, దాని ప్రత్యామ్నాయ మార్గాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి తీవ్ర హాని కలిగించడమే కాకుండా ప్రకృతి సమతుల్యతకు ముప్పుగా మారుతోందని పేర్కొన్నారు. సాధ్యమైనంతవరకు ప్లాస్టిక్ వస్తువులకు దూరంగా ఉంటూ పర్యావరణహిత వస్తువులను వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణానికి హాని కలిగించని వస్తువులను ఉపయోగించే అలవాటు చేసుకోవాలని కోరారు. మొక్కలు నాటడమే కాకుండా అవి పెరిగే వరకు బాధ్యతగా సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి కర్తవ్యమని అన్నారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో చైతన్యవంతులై సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు, పట్టణ ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలు అమలు చేయకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు: రేగా కాంతారావు

420 హామీలు, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేశారు



గుండాల,నవంబర్17 (జనంసాక్షి) :
ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు విమర్శించారు. మంగళవారం గుండాల మండలంలోని చెట్టుపల్లి, శంభునిగూడెం, వెన్నెలబైలు గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ 420 హామీలు, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి, మంత్రివర్గం విఫలమయ్యారని ఆరోపించారు. పినపాక ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు.అనంతరం గుండాల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో చింతలపాడు, ముత్తాపురం గ్రామాలకు చెందిన పలు కుటుంబాలు రేగా కాంతారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో తెల్లం భాస్కర్, మోకాళ్ల వీరస్వామి, తిరుకొల్లూరి రాము, వట్టం రవి, గడ్డం రమేష్, నిట్ట రాములు, తాటి కృష్ణ, గుగ్గిల లక్ష్మీనారాయణ, గొల్లపల్లి రమేష్, బండారి రాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు